

సర్వం సిద్ధం



- రేపటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
- జిల్లావ్యాప్తంగా 378 బస్సులు కేటాయింపు
- రోజూ 50 నుంచి 60 వేల మంది ప్రయాణించే అవకాశం
- ఇప్పటికే సిబ్బందికి శిక్షణ.. కొత్తగా 50మంది డ్రైవర్లు
- రేపటి నుంచి ప్రారంభం

జిల్లాలో ఉచిత ప్రయాణం పరంగా...

- కేటాయించిన బస్సులు : 378
- పల్లె వెలుగు : 312
- అల్ట్రా పల్లె వెలుగు : 10
- ఎక్స్‌ప్రెస్ బస్సులు : 56

సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా పంద్రాగస్టు రోజున మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా ఆర్టీసీ అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. జిల్లాలోని డిపోల వారీగా రోజువారి ప్రయాణికులకు తగ్గట్టుగా కసరత్తు మొదలుపెట్టి తగిన బస్సులతో పాటు సిబ్బందిని నియమించి ఉచిత ప్రయాణానికి సర్వం సిద్ధం చేశారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి అవకాశం కల్పించారు. రోజుకు 1.20లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. వీరిలో 40శాతం మంది మహిళా ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. రోజుకు ఆర్టీసీకి రూ. 65లక్షలు ఆదాయం వస్తోంది. ఫ్రీ బస్సు అమలైతే ఆదాయం తగ్గనుంది. ప్రభుత్వమే ఫ్రీ బస్సు ఖర్చును చెల్లించనుంది. ప్రయాణికుల రద్దీ పెరగనున్న నేపథ్యంలో ఆర్టీసీ డిపోల్లో ప్రయాణికుల కోసం తాగునీటి, మరుగుదొడ్ల సదుపాయం అధికారులు కల్పిస్తున్నారు.

నంద్యాల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం 'స్త్రీ శక్తి' పేరుతో మహిళలకు ఉచిత ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత ప్రయాణ సదుపాయం ప్రారంభించనుంది. జిల్లా ఆర్టీసీ అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. జిల్లాలోని ఏడు డిపోల వారీగా రోజువారి ప్రయాణికులకు తగ్గట్టుగా కసరత్తు మొదలుపెట్టి బస్సులతో పాటు సిబ్బందిని ఉచిత ప్రయాణానికి సిద్ధంచేశారు. జిల్లాలోని 493 బస్సులు.. 452 సర్వీసులు ఉండగా 378 బస్సులను ఉచిత ప్రయాణానికి కేటాయించారు. ఈలెక్కన రోజుకు జిల్లాలో 50 నుంచి 60 వేల మంది ప్రయాణించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో పుణ్యక్షేత్రాలు ఎక్కువగా ఉండటంతో ఈసంఖ్య మరింత పెరిగే అవకాశం కూడా లేకపోలేదు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఐదు రకాల బస్సుల్లో మాత్రమే సదుపాయం కల్పించారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రయాణాలు సాగించొచ్చు. చదువుకునే విద్యార్థినులకు పాఠశాలలు, కళాశాలల సమయంలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఉచిత బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులు తప్పనిసరిగా ఓటర్, ఆధార్, రేషన్ కార్డు ఇలా ఏదో ఒకటి గుర్తింపుకార్డు తప్పనిసరిగా చూపించి ప్రయాణం చేయాల్సి ఉంది.

ఇబ్బందులు తలెత్తకుండా..

మహిళా ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలోని బస్సుల ద్వారా రోజుకు 1.65 లక్షల కిలో మీటర్లు ప్రయాణం సాగిస్తున్నారు. రోజుకు 1.20లక్షల మంది ప్రయాణికులు ప్రయాణం చేస్తుండగా.. వీరిలో 40శాతం మంది మహిళా ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. రోజుకు ఆర్టీసీకి రూ. 65లక్షలు ఆదాయం వస్తోంది. ఫ్రీబస్సు అమలైతే ఆర్టీసీకి ఆదాయం తగ్గనుంది. ఆర్టీసీకి ప్రభుత్వమే ఫ్రీబస్సు ఖర్చును చెల్లించనుంది. డిపోలవారీగా ఎక్కడికక్కడ 700మంది కండెక్టర్లు, డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. కొత్తగా డైలీ వేజ్ కింద 50మంది డ్రైవర్లను తీసుకుని వారికి కూడా శిక్షణ ఇప్పించారు. ఇప్పటికే ఈపడాదిలో జిల్లాకు సూపర్ లగ్జరీ-36, ఎక్స్‌ప్రెస్‌లు-32 కొత్త బస్సులను ప్రభుత్వం పంపించింది. ఆయా ఆర్టీసీ డిపోల్లో ప్రయాణీకుల కోసం మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు అధికారులు కల్పించారు.

ఆ బస్సుల్లో నో ఎంట్రీ..

నాన్‌స్టాప్, అంతర్రాష్ట్ర, కాంట్రాక్టు క్యారేజ్, ప్యాకేజీ, సూపర్ లగ్జరీ, స్టార్ లైనర్, అల్ట్రా డీలక్స్, తదితర ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉండదు. ఎవరైనా టికెట్ కొనాల్సిందే. ఈ విషయం ప్రయాణికులు గుర్తించుకోవాలి.



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న పూల నాగరాజు

ఆర్థికంగా ఎంతో ఆదా..

ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు కల్పించే ఉచిత ప్రయాణం కోసం జిల్లాలో సర్వం సిద్ధం చేశాం. పేద, మధ్య తరగతి మహిళా ప్రయాణికులకు ఉచిత ప్రయాణం ఆర్థికంగా ఎంతో ఆదా కల్పించనుంది.

- రజియా సుల్తానా, ఆర్టీసీ ఆర్ఎం, నంద్యాల

ఉచిత ప్రయాణం మహిళలకు వరం



పంద్రాగస్టు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలకు ఉచిత ప్రయాణం కూటమి ప్రభుత్వం కల్పిస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే.. మహిళలకు అండగా.. సీఎం చంద్రబాబునాయుడు నిలుస్తున్నారు. ఉచిత ప్రయాణం మహిళలకు వరం లాంటిది.

- పూల నాగరాజు, ఆర్టీసీ కడప రీజనల్ చైర్మన్

సెప్టెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

కర్నూలు లీగల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో సెప్టెంబరు 13న జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి తెలిపారు. ఈ జాతీయ లోక్‌అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులే కాకుండా ప్రిలిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో మున్సిపల్, విద్యుత్, బ్యాంకింగ్, విద్యా రంగాల్లో ఉన్న వివాదాలే కాకుండా రాజీకి వీలుండే క్రిమినల్, సివిల్ కేసులను కూడా పరిష్కరిస్తామని తెలిపారు.

సారా రహిత జిల్లా లక్ష్యంగా పని చేయాలి

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి



సీఐలతో సమీక్షిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

కర్నూలు అర్బన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల ఆఖరులోపు జిల్లాను సారా రహితా జిల్లాగా మార్చాలని ఎక్సైజ్ డిప్యూటి కమిషనర్ పి. శ్రీదేవి అన్నారు. బుధవారం ఆమె తన చాంబర్‌లో అసిస్టెంట్ కమిషనర్ వి. హనుమంతరావు, సూపరిటెండెంట్ సుధీర్‌బాబు, నంద్యాల, కర్నూలు జిల్లాల ఎక్సైజ్ సీఐలతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ నవోదయం - 2.0ను ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో పర్మిట్ రూమ్‌ల రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను చెల్లించేటట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నంద్యాల ఈఎస్ రవికుమార్, అసిటెంట్ సూపరింటెండెంట్లు రాజశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

బలపనూరు ఎంజేపీ పాఠశాలకు రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు



బలపనూరులోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల

పాణ్యం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలకు రాష్ట్ర స్థాయి ఉత్తమ పాఠశాల అవార్డుకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఫ్లోరమ్మ తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ రెండేళ్లుగా పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినందుకు గానూ ఈ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 15న జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌కు పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు అభినందనలు తెలిపారు.

మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుందాం: కలెక్టర్



పోస్టరును విడుదల చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా మట్టితో తయారు చేసిన విగ్రహాలను ఏర్పాటు చేసుకొని పర్యావరణాన్ని కాపాడుదామని కలెక్టర్ రాజకుమారి పిలుపునిచ్చారు. నంద్యాల కలెక్టరేట్ కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ముద్రించిన పోస్టరును కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించకుండా పండుగలను సంతోషంగా జరుపుకోవాలన్నారు. హానికర రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను కాకుండా మట్టి విగ్రహాలను పూజించాలని కోరారు. పీవోపీ విగ్రహాల తయారీలో జిప్సం, సల్ఫర్, మెగ్నీషియం, సీసం వంటి రసాయనాలు ఉపయోగిస్తారని, అవి అత్యంత ప్రమాదకరమని చెప్పారు. రసాయనాలు కలిసిన నీటి వల్ల ఊపరితిత్తులు, కంటి సమస్యలు తలెత్తుతాయని, అలాగే మరణాలు సంభవిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనెల 25వ తేదీన కలెక్టరేట్‌లో మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన కల్పించి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు.

అశ్వవాహనంపై ప్రహ్లాదరాయలు

- వైభవంగా సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధన

6



నేనేమి చేశాను పాపం..

- ఉమ్మడి జిల్లాలో ఆగని భ్రూణ హత్యలు
- నిద్రమత్తులో వైద్య ఆరోగ్య శాఖ
- గాడితప్పిన స్కానింగ్ కేంద్రాల నిర్వహణ
- యథేచ్ఛగా లింగ నిర్ధారణ
- ఆర్ఎంపీలతో అబార్షన్లు
- కాసుల కక్కుర్తికి ఆడబిడ్డలు బలి

చిదిమేస్తున్నారు..!



ఆడపిల్లలను ఆదిలోనే చిదిమేస్తున్నారు.. లింగ నిర్ధారణ పరీక్షలతో పుట్టక ముందే చంపేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో లింగనిర్ధారణ పరీక్షలు జోరుగా సాగుతు న్నాయి. కొందరు అనర్హులు, ఆర్ఎంపీలు, కొందరు వైద్యులు కాసుల కక్కుర్తితో ఎంతోమంది పసి ప్రాణాలను తుంచేస్తున్నారు. లింగనిర్ధారణలో ఆడపిల్ల అని తేలితే కొంతమంది తల్లిదండ్రులు ఆడపిల్లలను భారంగా భావించి ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే ఆసరాగా ఇష్టారాజ్యంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ ఆడపిల్లలను ఈలోకంలోకి అడుగు పెట్టకుండా చేస్తున్నారు. భ్రూణహత్యల నివారణ కోసం పీసీపీఎన్‌డీఈ యాక్టు అమలులో జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ఎంతో కీలకమైంది.

కర్నూలు హస్పిటల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): . లింగ నిర్ధారణ పరీక్షలపై నిషేధం ఉన్నా ఉన్న ఆర్ఎంపీల సహాయంతో గర్భంలోనే ఆడ శిశువులను చిదిమేస్తున్నారు. పగిడ్యాల మండలం బీరవోలుకి చెందిన శ్రీవాణి ఆర్ఎంపీ చేసిన అబార్షన్ వికటించి ప్రాణం కోల్పోయింది. ఆ గర్భిణికి కర్నూలులోని రక్ష హాస్పిటల్‌లో స్కానింగ్ చేసి లింగ నిర్ధారణ చేశారని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ కర్నూలు జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.శాంతి కళకు లేఖ రాశారు. జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు ఏమేరకు పనిచేస్తున్నాయో అర్థమవుతుంది. రక్ష హాస్పిటల్‌లో లింగ నిర్ధారణ చేయించి అక్కడ ఆడబిడ్డ ఉన్నట్లు నిర్ధారణ చేసుకుని జూలై 29న నందికొట్కూరులోని ఓక్లినిక్‌లో ఆర్ఎంపీ అబార్షన్ చేశారు. 30వ తేదీ శ్రీవాణికి చనిపోయింది.

మిగతా 6వ పేజీలో..

వదలని వాన!



రాజోలి ఆనకట్ట వద్ద పొంగి ప్రవహిస్తున్న కుందూనది

- జిల్లాలో విస్తారంగా వర్షాలు
- 250 ఎకరాల్లో పంటలకు దెబ్బ
- ప్రమాదకరస్థాయిలో 'కుందూ' ప్రవాహం
- చాగలమర్రిలో రాజోలి ఆనకట్ట దాటి వరద
- ఆరెంజ్ అలర్ట్ ప్రకటించిన కలెక్టర్ రాజకుమారి
- రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తం

నంద్యాల, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలతో జిల్లా వ్యాప్తంగా 250 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. సుమారు రూ.20 లక్షల వరకు నష్టం జరిగి ఉండవచ్చని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. బండిఆత్మకూరు మండలం బోధనం, కాకనూరు గ్రామాల్లో కుందూనది, నిప్పులవాగు నుంచి నీటి ఉధృతికి పంటలు దెబ్బతిన్నాయి. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గురువారం కూడా ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విశాఖపట్నం తుఫాను హెచ్చరిక కేంద్రం వెల్లడించింది. 15,16,17వ తేదీల్లో ఉమ్మడి జిల్లాల్లో సాధారణం నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆ శాఖ అధికారులు హెచ్చరించారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 9గంటల వరకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 496 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లాకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ జిల్లా కలెక్టరేట్‌తో పాటు ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశారు. నదులు, వంకలు, పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజకుమారి హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులను సిద్ధం చేసుకోవాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను అప్రమత్తం చేశారు.

- చాగలమర్రిలో కుందూనది ఉగ్రరూపం దాల్చింది. చాగలమర్రిలోని రాజోలి ఆనకట్టను దాటి కుందూనది ప్రమాదకర రీతిలో ప్రవహిస్తోంది.
- డి.వనిపెంట చెరువు అలుగు వరద నీటితో పొంగి ప్రవహించింది.
- నందికొట్కూరు మండలంలో చెరువుకు గండిపడటంతో వంద ఎకరాల్లో మొక్కజొన్న పంట నీట మునిగింది.
- రుద్రవరం మండలంలోని శ్రీరంగాపురంలో భారీ వర్షాలకు ఓ మట్టిమిద్దె కూలిపోయింది. దీంతో నివాసంలో నిద్రిస్తున్న జయమ్మ అనే మహిళకు గాయాలయ్యాయి. చందలూరు గ్రామంలో చాకలి శ్రీనివాసులు, బోయ గురువమ్మలకు చెందిన మట్టి మిద్దెలు కూడా కూలాయి.
- చిలకలూరు గ్రామ సమీపంలో వక్కిలేరు వాగు, చందలూరు సమీపంలో చిన్నేరువాగు, కొండమాయపల్లె సమీపంలో బంగారమ్మ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.



కొత్తపల్లి మండలం నందికుంటలో ఇరుక్కుపోయిన కారు

- పాములపాడు మండలంలోని చెలిమిల్ల గ్రామంలో ఎద్దులవంక వాగు, సుద్దవాగు ఉధృతంగా ప్రవహించాయి.
- పాములపాడు మండలం ఇస్కాల గ్రామ శివార్లలోని భవనాశి వాగు ఉప్పొంగడంతో చట్టుప్రక్కల పంట పొలాలు మునిగి పోవడమే కాక శ్రీ నందీశ్వర ఆలయం నీట మునిగింది. దుద్యాలతో పాటు కొత్తపల్లి మండలాలకు రాకపోకలు నిలిచి పోయాయి
- కొత్తపల్లి మండలంలోని నందికుంట గ్రామంలో నల్లమల అడవుల నుంచి వర్షపు నీరు వచ్చి చేరింది. దీంతో ప్రజలు మోకాళ్లలోతు నీటిలోనే రాకపోకలు సాగించారు.



నీటమునిగిన కాలనీ



నందికొట్కూరులో చెరువుకు గండి



రుద్రవరం మండల కేంద్రంలో మొక్కజొన్న పంటలోకి చేరిన వర్షపు నీరు



చిలకలూరు గ్రామ సమీపంలో నేలవంకతెనపై ప్రవహిస్తున్న వర్షం నీరు

సాంకేతిక నైపుణ్యం అందించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యం అందించగలిగితే ఏ దేశంలోనైనా ఉపాధి అవకాశాలు పొందవచ్చని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో బుధవారం స్కూలింగ్, బిల్డింగ్ బ్లాక్స్ అనే అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి వర్క్‌షాపులో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా విద్యారంగాన్ని, మానవ వనరులను అభివృద్ధి చేసి భారతదేశాన్ని పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. అందులో భాగంగా ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ, కనీస కల్పన, విద్యలో సాంకేతికత సంబంధాల విషయాలపై సలహాలు, సూచనలు ఇవ్వడం కోసం ఈ వర్క్‌షాపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వికసిత్ భారత్‌లో భాగంగా 2047ను రూపొందించేందుకు ప్రస్తుతం 3 నుంచి 18 సంవత్సరాలు గల పిల్లలందరికీ విద్యలో కావాల్సిన టెక్నాలజీ, నైపుణ్యాలు అందించగలిగితే 2030 సంవత్సరానికి భారతదేశంలో 60 శాతం మంది ఉత్పాదకత రంగంలో ఉంటారని, వారందరూ నైపుణ్యం గల వ్యక్తులుగా మారితే భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా మారుతుందని అన్నారు. కార్యక్రమంలో డీఈవో శామ్యూల్ పాల్, సమగ్రశిక్ష సెక్టోరియల్ ఆఫీసర్స్, సీఎంవో, ఏఎంవోలు, క్లస్టర్ హెచ్‌ఎంలు, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

మరణంలోనూ ముగ్గురికి ప్రాణం

- బ్రెయిన్ డెడ్ అయిన శివరామ సుబ్బయ్య
- అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులు



మెడికవర్ హాస్పిటల్‌లో అవయవదాతకు ఘన నివాళి

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మరణంలోనూ ముగ్గురికి ప్రాణం పోశాడు ఆవ్యక్తి. బ్రెయిన్ డెడ్ కావడంతో కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించారు. బంధువులు తెలిపిన వివరాలు.. నంద్యాల జిల్లా కోయిలకుంట్ల మండలం పెద్దకొప్పర్ల గ్రామానికి చెందిన టి.శివరామ సుబ్బయ్య(39) ఆగస్టు 10న స్నేహితులతో కలిసి నదిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారిపడటంతో అతని తలకు పెద్దరాయి బలంగా తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. జమ్మలమడుగు హాస్పిటల్‌కు వెళ్లగా వారు కర్నూలుకు రెఫర్ చేశారు. అదేరోజు కర్నూలు ఓమినీ హాస్పిటల్‌కు చేర్చి వెంటిలేటర్‌పై చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌కు ఈనెల 11వ తేదీన తీసుకువచ్చారు. 12వ తేదీన వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారు. జీవన్‌ధాన్ ట్రస్టు, మెడికవర్ హాస్పిటల్ చొరవతో శివరామసుబ్బయ్య అవయవాలను దానం చేయాలని కుటుంబసభ్యులకు చెప్పగా భార్య రామ సుబ్బమ్మ, తల్లిదండ్రులు అవయవదానంకు ముందుకు వచ్చారు. కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డా.సాయిసుధీర్ నేతృత్వంలో మెడికవర్ నెఫ్రాలజిస్టు డా.సిద్ధార్థ హెరూర్, యురాలజిస్టు డా.అబ్దుల్ సమద్, డా.బి.ప్రవీణ్, డా.శరత్, వైద్య బృందం బుధవారం అవయవాలను సేకరించారు. సేకరించిన రెండు కిడ్నీల్లో ఒక కిడ్నీని నెల్లూరు అపోలో హాస్పిటల్‌కు, మరో కిడ్నీని కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌కు, లివర్‌ను కర్నూలు కిమ్స్ హాస్పిటల్‌కు పోలీసులు ఏర్పాటుచేసిన గ్రీన్‌చానల్ ద్వారా తరలించారు. అవయవదాత శివరామ సుబ్బయ్యకు మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి వైద్యులు, కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సాంఘిక దురాచారమైన బాల్య వివాహ వ్యవస్థను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి కోరారు. స్థానిక న్యాయ సేవాసదన్ భవనంలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహం చేసుకుంటే చిన్నతనంలోనే గర్భధారణ వల్ల పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, బాల్య వివాహాలను అరికట్టేందుకు తల్లిదండ్రులు కూడా సహకరించాలని ఆయన కోరారు. ఈ వ్యవస్థను రూపుమాపేందుకు ఈ సమీక్ష సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. పౌరహక్కుల రక్షణ, ఆదివాసీల హక్కుల పరిరక్షణ, సంచార తెగల వారు న్యాయం పొందేలా తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఇందుకోసం ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు చైతన్యం కల్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు డీఎంహెచ్‌వో పి.శాంతికళ, నంద్యాల డీఎంహెచ్‌వో ఆర్.వెంకటరమణ, కర్నూలు సీడీపీవో డైరెక్టర్ పి.విజయ, కర్నూలు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ బి.రాధిక, నంద్యాల గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.హుస్సేనయ్య, నంద్యాల జిల్లా మహిళా పోలీసు స్టేషన్ సీఐ పి.గౌతమి, ఉమ్మడి జిల్లాలోని రెవెన్యూ, దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా చూడాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 4వ తేదీన నిర్వహించనున్న వినాయక నిమజ్జనం ఉత్సవం సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 4న వినాయక నిమజ్జన ఉత్సవం సందర్భంగా ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో బుధవారం కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం ఉత్సవ నిర్వహణకు సంబంధించి ఆయా శాఖలకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతలకు ఎలాంటి సమస్యలు రాకుండా పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కేసీ కెనాల్‌లో నీటి ప్రవాహం నిమజ్జనానికి తగినట్లుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రాంతాల్లో జరిగే నిమజ్జనోత్సవానికి పోలీసు శాఖ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తుందని తెలిపారు. సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో వెంకటనారాయణమ్మ, అడిషనల్ ఎస్పీ హుస్సేన్‌పీరా పాల్గొన్నారు.



సంస్థాన పూజ చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



అశ్వవాహనుడైన ప్రహ్లాదరాయలకు ఊంజల సేవ చేస్తున్న పీఠాధిపతి

అశ్వవాహనంపై ప్రహ్లాదరాయలు

- వైభవంగా సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధన
- బంగారు పల్లకిలో రాఘవేంద్రుల విహారం
- సంస్థాన పూజ చేసిన పీఠాధిపతి

మంత్రాలయం ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వేదపండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాల్లో భాగంగా 6వ రోజు మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ప్రత్యేక పూజలు, అలంకరణ చేసి మహా మంగళహారతులు ఇచ్చారు. కర్ణాటకలోని నంజనగూడలో వెలసిన రాఘవేంద్ర స్వామి శిష్యులైన సుజ్ఞానేంద్రతీర్థుల బృందావనాన్ని పీఠాధిపతి ఆశీస్సులతో అక్కడి పండితులు ప్రత్యేక పూజలుచేసి, హారతులు ఇచ్చి శోభయానుమానంగా అలంకరించారు. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు అశ్వవాహనంపై మఠం ప్రాంగణం చుట్టూ ఊరేగారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించి చెక్క, వెండి, బంగారు, రజిత రథోత్సవాలపై ఊరేగారు. ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాఘవేంద్ర బృందావన ప్రతిమను బంగారు పల్లకిలో ఊరేగించారు. సంస్థాన పూజల్లో భాగంగా పూర్ణబోధ పూజా మందిరంలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూలరాములకు, జయరాములు, దిగ్విజయకరాములకు బంగారు నాణేలతో అభిషేకించి హారతులిచ్చారు. కార్యక్రమంలో పండిత కేసరి రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, మఠం దివాన్ సుజీంద్రాచార్, ఆనంద తీర్థాచార్, గౌతమాచార్, ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ఏఈలు బద్రినాథ్, శ్రీహరి, వ్యాసరాజాచార్, బిందుమాధవ్, ద్వారపాలక అనంతస్వామి, జయతీర్థాచార్, వాదిరాజాచార్, డీఎం ఆనందరావు, జేపీ స్వామి, అనంతపురాణిక్, రవికులకర్ణి పాల్గొన్నారు.



బృందావనానికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

ఉత్సవాల్లో ఆరవ రోజైన బుధవారం రాత్రి యోగీంద్ర కళామండపంలో బెంగుళూరుకు చెందిన సుధ స్కూల్ ఆఫ్ డ్యాన్స్ వారిచే హరిదర్శన్, నృత్యరూపకం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. బెంగుళూరు చెందిన విద్వాన్ ఎంఎస్ సుబ్బలక్ష్మి, బెంగుళూరు చెందిన దాసవాని సాహిత్యం భక్తులను కనువిందు చేశారు.

నేడు ఉత్సవాలకు ముగింపు

రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలు గురువారం ముగియనున్నాయి. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు సర్వసమర్పణోత్సవం చేసి ఉత్సవాలకు ముగింపు పలకనున్నారు. పంచ రథాలపై ప్రహ్లాదరాయలను అలంకరించి ఊరేగించనున్నారు. పీఠాధిపతి బృందావనానికి మహా మంగళహారతులు ఇచ్చి భక్తులను ఆశీర్వదించి ఉత్సవాలకు ముగింపు పలుకుతారు. ఈ సందర్భంగా ఉత్సవాల ముగింపులో భా గంగా గురువారం రాత్రి యోగీంద్ర కళామండపంలో బెంగుళూరు చెందిన విద్వాన్ ఎస్ఎస్ ప్రసాద్‌చే పూణేకి చెందిన విద్వాన్ ఆనంద్ భీమ్‌సేన్ జోషిచే శాస్త్రీయ సంగీతం, చెన్నైకి చెందిన కళాకారుల బృందంచే భరతనాట్యం భక్తులను ఆకట్టుకోనున్నాయి.

'రక్షణ'లో రామరాజు

- డీఆర్‌డీవోలో కొలువు
- శాస్త్రవేత్తగా బాధ్యతలు
- ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం
- దేశానికి సేవ చేయాలన్నదే సంకల్పం
- పలువురి అభినందనలు



తల్లిదండ్రులు నాగేశ్వరరావు, ఈశ్వరమ్మలతో రామరాజు

కొలిమిగుండ్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రామరాజు అరుదైన ఘనతను సాధించారు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన డీఆర్‌డీవో(భారత రక్షణ పరిశోధన సంస్థ)లో ఉద్యోగం సంపాదించారు. ఈమేరకు బుధవారం రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ డీఆర్‌డీవోలో శాస్త్రవేత్తగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రామరాజు 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో ముచ్చటించారు. కొలిమిగుండ్లకు చెందిన ఇరికమాను నాగేశ్వరరావు, ఈశ్వరమ్మ నిరుపేద దళిత దంపతుల పెద్ద కుమారుడు రామరాజు. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసించారు. ప్రాథమిక విద్య కొలిమిగుండ్ల ఎస్సీ పాఠశాలలో చదవగా, అనంతరం ఏపీ గురుకుల పాఠశాలలో ఉన్నతవిద్యను అభ్యసించారు. ఇం టర్ ఎంపీసీలో రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించడంతో పాటు, ప్రతిష్టాత్మకమైన జార్ఖండ్ రాంచీ ఎన్ఐటీ 2012లో సీటు సంపాదించారు. అప్పటి ఉమ్మడి ఏపీ సీఎం రోశయ్య నుంచి రూ.25వేలు నగదు పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం ఐఐఎస్‌సీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్) బెంగుళూరులో విద్యనభ్యసిస్తుండగా దేశంలో ప్రతిష్టాత్మకమైన ఐటీసీఎల్ కంపెనీలో 2017లో ఉద్యోగం పొందారు. అందులో ఇంజనీరుగా పనిచేస్తూనే ఎలాగైనా భారత రక్షణ పరిశోధన సంస్థలో ఉద్యోగం సంపాదించాలన్న లక్ష్యంతో కష్టపడి చదివారు. దీంతో ఇటీవల గేట్ ఫలితాల్లో ఆల్ ఇండియా 70వ ర్యాంకు సాధించి, తన కలను సాకారం చేసుకున్నారు. అత్యున్నతమైన భారత రక్షణ పరిశోధన సంస్థలో శాస్త్రవేత్తగా అవకాశం రావడం పట్ల పలువురు అధికారులు, నేతలు అభినందిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంతో పాటు, జిల్లాకే గర్వకారణమని పలువురు కొనియాడుతున్నారు. ఎమ్మార్పీస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ రామరాజు కృషిని అభినందించారు. దేశానికి సేవ చేసే అవకాశం రావడం గొప్ప వరమని ఆశీర్వదించినట్లు రా మరాజు వెల్లడించారు. దీంతో తల్లి దండ్రులు నాగేశ్వరరావు, ఈశ్వరమ్మతో పాటు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతలకు స్వాంతన

- రాజముద్రతో పాసు పుస్తకం
- జిల్లాకు చేరిన 1.5 లక్షల పాసు పుస్తకాలు



కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బొమ్మతో రైతులకు ఇచ్చిన పట్టాదారు పాసు పుస్తకాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో ఎవరి బొమ్మలు లేకుండా రాజముద్రతో ఎటువంటి లోపాలు లేకుండా రైతులకు స్వాంతన చేకూర్చే విధంగా పాసు పుస్తకాలను కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. గత ప్రభుత్వంలో వారసత్వంగా, కష్టపడి సంపాదించి కొనుగోలు చేసిన భూములపై నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బొమ్మతో ముద్రించిన పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. దీనిపై రైతుల్లో తీవ్ర ఆందోళన మొదలైంది. గత ప్రభుత్వం చేసిన పొరపాట్లను చక్కదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తప్పులతడకగా మారిన భూసర్వేను మళ్లీ గాడిన పెట్టేందుకు రైతుల పొలాలకు సంబంధించి సరైన హద్దులతో పాసు పుస్తకాలు పంపిణీ చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా ఆగస్టు 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా రాజముద్రతో పాసు పుస్తకాలను పంపిణీ చేసేందుకు సిద్ధమైంది. ఈ తరహా పాసు పుస్తకాలు అందించేందుకు ఆగస్టు 31 వరకు ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. కర్నూలు జిల్లాకు 1.05లక్షలు పాసు పుస్తకాలు విడుదల చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఈపాసు పుస్తకాల్లో ఇంకా ఏమైనా తప్పు ఒప్పులు ఉన్నాయేమోనని వారం రోజులుగా మండల కేంద్రాల్లోని రెవెన్యూ కార్యాలయాల్లో వీఆర్వోలు, తహసీల్దార్లు, ఆర్‌ఐలు సూక్ష్మ స్థాయిలో పరిశీలన చేస్తున్నారు. గ్రామాల వారీగా తహసీల్దార్ల ఆధ్వర్యంలో సదస్సులు ఏర్పాటు చేసి పాసు పుస్తకాలను రైతులకు పంపిణీ చేస్తారు.

దరఖాస్తుకు గడువు పెంపు

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతికి దరఖాస్తు చేసుకునే గడువును పొడగించినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఆగస్టు 13వ తేదీ వరకు ఉన్న గడువును ఆగస్టు 27వ తేదీ వరకు పొడగించారని చెప్పారు. అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు జవహర్ నవోదయ విద్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

'వ్యాపారవేత్తగా ఎదగాలి'



మాట్లాతున్న జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం జవహర్ బాబు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం నుంచి ఒకరు వ్యాపారవేత్తగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జవహర్ బాబు తెలిపారు. బుధవారం కార్యాలయంలో పరిశ్రమల ప్రతినిధులతో ఉద్యం పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమకు నైపుణ్యం కలిగిన రంగంలో వృద్ధి చెందాలని, ఇందుకు సంబంధించి వారి పేర్లను ఉద్యంలో నమోదు చేసుకోవాలని సూచించారు. దీనివల్ల ప్రభుత్వ పథకాల పరంగా వెసులుబాటు, బ్యాంక్ రుణాలు, వడ్డీ రాయితీ వంటి ప్రోత్సాహకాలు ఉంటాయని తెలిపారు. ఉద్యంలో పేర్ల నమోదు ఉచితంగా చేస్తారని, దళారులను ఆశ్రయించి మోసపోవద్దని జవహర్‌బాబు సూచించారు. కార్యక్రమంలో ఐపీవోలు డానియేలు, హరిహరరెడ్డి, నూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చిదిమేస్తున్నారు...!

5వ పేజీ తరువాయి

ఈఘటనపై మృతురాలి తల్లి శివమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందికొట్కూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈఘటనపై ఆర్‌ఎంపీ గీతారాణి, రక్ష హాస్పిటల్ స్కానింగ్ టెక్నీషియన్ శేఖర్, హాస్పిటల్ మేనేజ్‌మెంట్‌పై కేసు నమోదు చేశారు. జిల్లాలో స్కానింగ్ కేంద్రాల నిర్వహణ గాడి తప్పింది. యథేచ్ఛగా స్కానింగ్ కేంద్రాలు లింగ నిర్ధారణ చేస్తున్న అధికారుల్లో ఏమాత్రం చలనం లేదు. ఉవ మ్మడి

- రెండు నెలల క్రితం కర్నూలుకి చెందిన తల్లి, కూతురు, కర్నూలు డీఎంహెచ్‌వో ఆఫీసుకు ఫిర్యాదు చేయడానికి వచ్చారు. తమకు నగరంలోని ధర్మపేటలోని చల్లా కాంపౌండులో కూతురుకు అనర్హులు అబార్షన్ చేశారంటూ డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు.
- నెలరోజుల క్రితం కర్నూలు నడిబొడ్డున ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూడయాగ్నస్టిక్ బ్లాక్ వద్ద మృతి చెందిన ఓ మృత శిశువును కొందరు ఖాళీ స్థలంలో పడేసి వెళ్లారు. శిశువుకు చీమలు పట్టాయి.
- జూలై 29న నందికొట్కూరు పాతబస్టాండులో ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌లో మూడో కాన్పు కోసం వచ్చిన గర్భిణికి ఆడశిశువు అని నిర్ధారణ చేసి ఎంటీపీ (మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) చేశారు. ఆమె మరణించింది. కర్నూలు రక్ష హాస్పిటల్‌లో గర్భిణికి లింగనిర్ధారణ చేశారు.

జిల్లాలో ఈమూడు ఘటనలు పరిస్థితికి అద్దం పడుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో స్కానింగ్ కేంద్రాలు భ్రూణ హత్యలకు పాల్పడుతున్నాయి.

కలెక్టర్ గారూ.. డెకాయ్ ఆపరేషన్లు ఏమయ్యాయి?

ఉమ్మడి జిల్లాలో కర్నూలు, కోడుమూరు, డోన్, ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో కొందరు అనుమతులు లేకుండా స్కానింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసుకుని చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ చేస్తూ ఆడపిల్లలను చంపేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 2012లో అప్పటి డీఎంహెచ్‌వో డా.వై.నరసింహులు, ట్రైనీ కలెక్టర్ ప్రశాంత్ పాటిల్ సిబ్బంది 13 స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి సీజ్ చేశారు. ఆ తర్వాత జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు స్కానింగ్ కేంద్రాల జోలికి వెళ్లలేదు. వైద్యఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇక లాభం లేదనుకున్న జిల్లా విజిలెన్స్ అధికారులు 2016లో డెకాయ్ ఆపరేషన్, దాడులు నిర్వహించి కర్నూలులోని ఎన్‌ఆర్‌పేటలో ఓఆర్‌ఎంపీ, స్కానింగ్ కేంద్రం, కొత్తబస్టాండు సమీపంలోని జేబీ హాస్పిటల్, అమ్మ హాస్పిటల్, గూడూరు, ఆదోనిలో ఓహాస్పిటల్‌పై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి కేసులు పెట్టారు. 2012 తర్వాత ఇప్పటి వరకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గానీ, డెమో అధికారులు ఒక డెకాయ్ ఆపరేషన్ కూడా నిర్వహించిన దాఖలాలు లేవు. కలెక్టర్ అనుమతితో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలి. ఇందులో ఎన్‌జీవోలు తప్పక ఉండాలి. డెమో విభాగం తమ గదులకే పరిమితమయ్యారు.

నామమాత్రంగా పీసీపీఎన్‌డీటీ సెల్

భ్రూణహత్యలను అరికట్టేందుకు ఉమ్మడి జిల్లా వైద్యఆరోగ్య శాఖలో పీసీపీఎన్‌డీటీ (ప్రీ కాన్సెప్షన్ ప్రీనేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్) సెల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెల్ కొద్ది రోజులుగా స్తబ్దుగా ఉంది. డెమో విభాగం నిర్వహిస్తుంది. పీసీపీఎన్‌డీటీ సెల్‌కు నోడల్ ఆఫీసర్‌గా జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి వ్యవహరిస్తారు. స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్లు, రెన్యువల్, ఫారం-ఎఫ్, బాల్యవివాహాలు, భ్రూణహత్యలు జరగకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. లింగ నిర్ధారణ గురించి, ఆడపిల్లల ప్రాధాన్యత గురించి చట్టం గురించి, కౌమార బాలికలకు, కాలేజీ విద్యార్థులకు, మత పెద్దలతో సమావేశాలు నిర్వహించాలి. ఇది ఎక్కడా అమలు కావడం లేదు. పీసీపీఎన్‌డీటీ, డెమో విభాగాలు కేవలం స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్స్‌కే పరిమితమయ్యారు. జిల్లాలో ఆడశిశువులను ముళ్ల కంపలో పడేస్తున్నారు. ఆడపిల్లలు కడుపులో ఉన్నారని, లింగ నిర్ధారణ చేసి అబార్షన్‌లు చేస్తున్న ఘటనలు జరుగుతున్నా ఏమాత్రం పట్టించు కోవడం లేదు.

ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తూ..

ఉమ్మడి జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు జోరుగా సాగుతున్నాయి. కొందరు అనర్హులు, ఆర్‌ఎంపీలు, కొందరు వైద్యులు కాసుల కక్కుర్తితో ఎంతోమంది పసిప్రాణాలను తుం చేస్తున్నారు. లింగనిర్ధారణలో ఆడపిల్ల అని తేలితే కొంతమంది తల్లిదండ్రులు ఆడ పిల్లలను భారంగా భావించి ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఇదే ఆసరాగా ఇష్టారాజ్యంగా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ ఆడపిల్లలను ఈలోకంలోకి అడుగు పెట్టకుండా చేస్తున్నారు. ఇటీవల పగిడ్యాల మండలం బీరవోలుకు చెందిన మహిళ మూడోసారి గర్భం దాల్చింది. అప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మూడోసారి కూడా అనుమానం వచ్చి కర్నూలులోని రక్ష హాస్పిటల్‌లో స్కానింగ్ చేయించారు. అక్కడ ఆడబిడ్డ ఉన్నట్లు నిర్ధారణ చేసుకుని నందికొట్కూరులో అబార్షన్ చేయించారు. ఇలా గర్భస్రావం చేయించుకున్న గర్భిణులు చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఉమ్మడి జిల్లాలో గర్భస్థ శిశు పరీక్షలకు సంబంధించి 372 స్కానింగ్ కేంద్రాలకు అనుమతి ఉంది.

బీరవోలు ఘటనపై భిన్న వాదనలు

నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం బీరవోలులో ఓగర్భిణికి ఆర్‌ఎంపీ అబార్షన్ చేయడంతో తీవ్ర రక్తస్రావం జరిగి మృతి చెందింది. దీనిపై పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ మధ్య భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. మూడోసారి గర్భందాల్చిన ఆమెను కుటుంబ సభ్యులు నందికొట్కూరులోని ఓఆర్‌ఎంపీని సంప్రదించి అబార్షన్ చేయించగా అది వికటించి మృతిచెందింది. ఆ తర్వాత ఆమహిళకు ఎక్కడ లింగ నిర్ధారణ చేశార్న విషయం తెరమీదకు వచ్చింది. కర్నూలు రక్ష హాస్పిటల్‌లో లింగ నిర్ధారణ చేశారని, అక్కడ ఆడ శిశువు అని నిర్ధారించినట్లు విచారణలో తేలినట్లు నందికొట్కూరు రూరల్ పోలీసులు కేసులు పెట్టారు. మరో పక్క లింగనిర్ధారణపై వచ్చిన ఆరోపణలపై రక్ష హాస్పిటల్‌కు కర్నూలు డీఎంహెచ్‌వో రెండు షోకాజ్ నోటీసులు జారీచేశారు. దీంతో రక్ష హాస్పిటల్ యాజమాన్యం వచ్చి స్కానింగ్ కేంద్రానికి అనుమతులు ఉన్నాయని, స్కానింగ్ పరీక్షలు తాము చేయలేదని, యంత్రం చెడిపోయిందని, కండిషన్‌లో లేదని వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంతో రక్ష హాస్పిటల్‌లో లింగ నిర్ధారణ చేశారని కుటుంబసభ్యులు చెప్పిన విషయం నిజమా? స్కానింగ్ మిషన్ పనిచేయడం లేదని లింగనిర్ధారణ చేయలేదని రక్ష హాస్పిటల్ యాజమాన్యం చెప్పిన విషయం వాస్తవమా? అన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇరు వర్గాల వాదనలు వేర్వేరుగా ఉండటంతో గందరగోళం నెలకొంది.



జిల్లా మల్టీ నెంబరులో కలెక్టర్, ఎస్పీ, న్యాయాధికారి

జిల్లాలో భ్రూణహత్యల నివారణ కోసం పీసీపీఎన్‌డీఈ యాక్టు అమలులో జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ఎంతో కీలకమైంది. ఈకమిటీకి చైర్మన్ కలెక్టర్ వ్యవహ రిస్తారు. సభ్యులుగా జిల్లా న్యాయాధికారి, ఎస్పీ, డీఎంహెచ్‌వో, ఎన్‌జీవోలు ఉంటారు. ఈకమిటీ స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేయడం, రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయడం, లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై దాడులుచేయాలి. తనిఖీలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ సీజ్ చేయాలి. లింగ నిర్ధారణ ఆడ పిల్లల ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. కర్నూలు జిల్లాలో మాత్రం జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ నామమాత్రంగా పని చేస్తుంది. స్కానింగ్ కేంద్రాల తనిఖీలకు పీసీపీఎన్‌డీఈ సెల్ నోడల్ అధికారి, డెమో, లీగల్ కన్సల్టెంట్‌లు మాత్రమే వెళ్తున్నారు. ఎక్కడ ఎన్జీవోలను తనిఖీలకు తీసుకెళ్లడం లేదు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విధిగా నెలలో పది శాతం స్కానింగ్ కేంద్రాలను తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని వాటిని సీజ్ చేయాలి.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే మూడేళ్లు జైలు

ఏటా ఆడపిల్లలు సంతతి తగ్గిపోతుంది. అందుకే కేంద్ర ప్రభుత్వం పీసీపీఎన్‌డీటీ, యాక్టు 1994చట్టం అమలులోకి తెచ్చింది. ఈచట్టాన్ని అతిక్రమిస్తే ఎలాంటి శిక్షలు ఉంటారో తెలుసుకుందాం.

- గర్భస్థ పూర్వ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టం 1994 ప్రకారం నిబంధనలు 1996 ప్రకారం గర్భస్థ పిండ నిర్ధారణ నేరం
- గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా ఇందుకు ప్రోత్సహించిన వారికి చట్టం ప్రకారం రూ.10వేలు జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధించొచ్చు.
- గుట్టచప్పుడు కాకుండా గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణహత్యలకు పాల్పడుతున్న వైద్యులు స్కానింగ్ కేంద్రాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి పిర్యాదు చేయవచ్చు. అలాంటి కేంద్రాలపై అధికారులు దాడులుచేసి చట్టప్రకారం శిక్షించేందుకు ప్రభుత్వం నివేదిస్తారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. వివరాలివీ.. ఆదోని పట్టణానికి చెందిన ఎరుకల లక్ష్మన్న(28) ఎమ్మిగనూరు పట్టణంలో తమ బంధువుల పెళ్లి కోసం వచ్చారు. అయితే పెళ్లి ముగించుకొని బైకుపై ఆదోనికి వెళ్తుండగా కొటేకల్లు గ్రామ సమీపంలో బైకు అదుపు తప్పి చెట్టుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేయడంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. లక్ష్మన్న భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

రూ.5 లక్షల అపహరణ


బాధితుడు గోపాల్ రెడ్డి

ఆలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులో డబ్బు డ్రా చేసుకుని వెళుతున్న బాధితుడిని గమనించిన దుండగులు రూ.5లక్షలను అపహరించుకుని పోయారు. బాధితుడి కథనం మేరకు.. హాలహర్వి మండలం మల్లికార్జునపల్లి గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డి ఆలూరులోని స్టేట్ బ్యాంక్ నుంచి రూ.5 లక్షలు డ్రా చేసుకుని బైకులో గ్రామానికి వెళుతున్నాడు. దారి మధ్యలో మూత్ర విసర్జన కోసం బండి పక్కన పెట్టి వెళ్లాడు. బాధితుడిని గమనించి వెంబడించిన దుండగులు సీటీ ఫక్కీలో రూ.5 లక్షలు అపహరించుకు పోయారు. తిరిగి వచ్చిన బాధితుడు బండలో డబ్బులు లేకపోవడాన్ని గమనించి లబోదిబోమంటూ ఆలూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కుందూ నదిలో పడి దివ్యాంగుడి మృతి


రమణారెడ్డి (ఫైల్)

బండి ఆత్మకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నివాసం ఉంటున్న రమణారెడ్డి (58) అనే దివ్యాంగుడి కుందూనదిలో పడి మృతి చెందారు. లింగాపురం గ్రామం నుంచి రమణారెడ్డి సుమారు 20 ఏళ్ల క్రితం భార్య పిల్లలతో బండిఆత్మకూరుకు వచ్చారు. కొంత కాలం తరువాత భార్య ఇద్దరు కూతుళ్లతో కలిసి గని గ్రామంలో ఉంటున్నారు. అప్పటి నుంచి రమణారెడ్డి ఒక్కడే ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం బండిఆత్మకూరు కుందూనది వంతెనపై నుంచి తన ట్రై సైకిల్‌తో సహా కుందూనదిలో పడిపోయారు. పోలీసులు గాలింపు చేపట్టి సాయంత్రం నంద్యాల నందమూరినగర్ రహదారిలోని కుందూ వంతెన వద్ద ఈతగాళ్ల సహాయంతో రమణారెడ్డి మృతదేహాన్ని వెలికితీశారు. రమణారెడ్డి కూతురు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ అక్బర్ తెలిపారు.

రైలు ఢీకొని వృద్ధురాలు..

నంద్యాల టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బొగ్గులైన్‌కు చెందిన వృద్ధురాలు వెంకటమ్మ (85) రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ కుమారి తెలిపారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివీ.. మంగళవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన సమయంలో కాచిగూడ రైలు ఢీకొట్టింది. దీంతో గమనించిన బంధువులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైలు నుంచి జారి పడి మరొకరు..

నంద్యాల రైల్వే స్టేషన్ పరిధిలోని గుడిమెట్ట వద్ద రైలు నుంచి జారి పడి మద్దయ్య (42) దుర్మరణం చెందారు. రైల్వే ఎస్ఐ కుమారి తెలిపిన వివరాలివీ.. కర్నూలు జిల్లా లక్ష్మీపురానికి చెందిన మద్దయ్య 11వ తేదీన కర్నూలు నుంచి విజయవాడకు అమ్మవారి దర్శనార్థం వెళ్లారు. అయితే తిరిగి వచ్చే సమయంలో మంగళవారం గుంటూరు-డోన్ రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి బలవన్మరణం


నంద్యాల టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమై ఓ యువకుడు నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ కుమారి తెలిపారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివీ.. గడివేముల మండలం కొర్రపోలూరుకు చెందిన సూర్య (23) డిగ్రీ పూర్తి చేసుకుని హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే ఒక యువతిని ఏడాదిగా ప్రేమిస్తున్నాడు. అయితే సూర్య ప్రేమిస్తున్న యువతికి నిశ్చితార్థం అయింది. దీంతో మనస్థాపం చెందిన సూర్య కవులూరు వద్ద ఈనెల 11న రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాన్స్‌జెండర్ ఆత్మహత్య

కర్నూలు క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన నిస్సార్ (24) అనే హిజ్రా (ట్రాన్స్ జెండర్) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. వీకర్‌సెక్షన్ కాలనీకి చెందిన కటిక నిసార్ పూర్తిస్థాయిలో ట్రాన్స్‌జెండర్ (లింగమార్పిడి ఆపరేషన్ కోసం)గా మారేందుకు తన తండ్రిని డబ్బులు అడిగాడు. తండ్రి నిరాకరించడంతో నిసార్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. క్షణికావేశంలో ఇంట్లో బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన బంధువులు నిసార్‌ను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

ఎస్‌బీఐ మేనేజర్‌పై కర్రలతో దాడి

- ఇద్దరిపై కేసు నమోదు


బ్యాంక్ మేనేజర్ హరిప్రసాద్

ఆలూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలగవల్లి గ్రామ స్టేట్ బ్యాంక్ ఆఫ్ మేనేజర్ హరిప్రసాద్‌పై దాడి చేశారు. దీంతో ఆయన ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యారు. వివరాలివీ.. మొలగవల్లి గ్రామానికి చెందిన మహిళ గత నెల అదృశ్యమైనట్లు ఆలూరు పోలీస్ స్టేషన్‌లో ఆమె బంధువులు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు అయింది. అయితే మహిళ అదృశ్యం వెనుక బ్యాంకు మేనేజర్ హరిప్రసాద్ ప్రమేయం ఉందన్న అనుమానంతో ఈనెల 12న వాహనంలో గుంతకల్లు, ఆలూరుకు తీసుకెళ్లి కర్రలతో దాడి చేశారు. అనంతరం ఇంటి వద్ద బుధవారం తెల్లవారుజామున ఇంటి వద్ద వదిలివెళ్లారు. గుంతకల్లు మండలం బుగ్గసంగాలకు చెందిన జీవన్ కుమార్, మొలగవల్లి గ్రామంలో అదృశ్యమైన మహిళ సోదరుడు దస్తగిరి తనపై దాడి చేసి రూ.కోటి డబ్బులు ఇవ్వాలని బెదిరించినట్లు మేనేజర్ హరిప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జీవన్‌కుమార్, దస్తగిరిపై కిడ్నాప్, దాడి చేసినట్లు కేసు నమోదు చేశామని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు క్రైం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం హెచ్చరించారు. వారం రోజుల క్రితం ప్రారంభమైన నేను ట్రాఫిక్ మిత్రకు మంచి స్పందన లభించింది. వివిధ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనలపై రాంగ్ పార్కింగ్, రాంగ్ రూట్, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై 19 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఎవరైనా ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడితే పోలీస్ వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్ 7777877722కు ఫొటోలు, వీడియోలు తీసి పంపించాలన్నారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన వారిని కౌన్సెలింగ్ చేసి జరిమానాలు విధిస్తామన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

తెగుళ్లతో జాగ్రత్త

- అధిక వర్షాలతో నీటిలోనే పంటలు
- వేరుకుళ్లు తెగుళ్లు సోకే ప్రమాదం
- యాజమాన్య పద్ధతులు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు


ఆదోని మండలం ధణాపురం గ్రామం వద్ద నీట మునిగిన పత్తి పంట

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల వల్ల పంటలు ముంపునకు గురయ్యాయి. ఆదోని డివిజన్‌లో అధికంగా పత్తి, వేరుశనగ, మిరప, వరి, జొన్న సజ్జ, కంది పంటలు సాగయ్యాయి. నల్లరేగడి పొలాలలో సాగైన పంటలు అధికంగా నీరు నిల్వ ఉండడం వల్ల దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక తేమ శాతం వల్ల పూత, కాయ రాలటం, పంట పెరుగుదల కుంటుపడడంతో పాటు దిగుబడులు తగ్గి, పంట నాణ్యత కూడా లోపిస్తుంది. వర్షాల వల్ల ముంపునకు గురైన పంటల్లో యాజమాన్య పద్ధతులను పాటిస్తే నష్టాన్ని నివారించవచ్చని ఆదోని ఏడీఏ బాలవర్ధిని రాజు తెలిపారు. ఆదోని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఆదోని, కౌతాళం పెద్దకడబూరు, కోసిగి మండలాల్లో 89,127 హెక్టార్లలో వివిధ పంటలు సాగాయి. గత వారం రోజులుగా అధిక వర్షాలు కురుస్తుండడంతో పొలాల్లో వర్షపు నీరు చేరి తెగుళ్లు సోకే ప్రమాదం ఉంది. పొలాల్లో ఉన్న నీటిని వీలైనంత త్వరగా బయటికి పంపాలి. నేల కోతకు గురికాకుండా పంటలను వాలుకు అడ్డంగా నాటుకోవాలి.

పత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పత్తి పంటలో వర్షపు నీరు నిలబడితే పూత, పిందె, కాయలు రాలిపోవడం, ఆకులు ఎర్రబడి వాడిపోతాయి. పొలంలో నిలబడి ఉన్న నీటిని తీసి వేయాలి. ఎకరాకు 25-30 కిలోల యూరియా, 10-15 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను అదనంగా వేయాలి. వాతావరణం అనుకూలించిన వెంటనే పలుమార్లు అంతర కృషి చేయాలి. వర్షం తెరపిచ్చాక అవసరాన్ని బట్టి పొటాషియం నైట్రేట్ 2% (20గ్రా..లీ.) నీటికి కలిపి ఏడు నుంచి పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. పత్తిలో కాయ కుళ్లు తెగులు, ఆకు మచ్చ వ్యాధులను నివారించడానికి 3గ్రా. కాఫర్ ఆక్సీక్లోరైడ్‌ని లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

యాజమాన్య పద్ధతులతోనే నివారణ



అధిక వర్షాలతో అక్కడక్కడ పొలాలలో నీరు నిల్వ ఉంటుంది. రైతులు వెంటనే ఆ నీటిని కాలువల ద్వారా బయటికి పంపించే ఏర్పాటు చేయాలి. తెగుళ్లు, పురుగు శోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. యాజమాన్య పద్ధతులను అనుసరించి వ్యవసాయ అధికారుల సూచనలతో మందులను పిచికారీ చేస్తే నష్టాన్ని నివారించుకోవచ్చు. **- బాలవర్ధిని రాజు, ఏడీఏ, ఆదోని**

వేరుశనగ పంటలో..



పొలంలో నిలకడగా ఉన్న ముంపు నీటినీ వీలైనంత త్వరగా మురుగు కాలువల ద్వారా బయటకు పంపాలి. వేరుశనగ పంట 20 నుంచి 25రోజుల వయసు ఉన్నట్లయితే ఎకరాకు ఇమజితాపిర్ 10% ఎస్ఎల్ 25 మి.లీ. కలుపు మందును 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఇనుము ధాతులోపం గుర్తించచినట్లయితే లోపాన్ని సవరించడానికిపై పాటుగా 5 గ్రా. అన్నబేది మరియు 1గ్రా..సిట్రిక్ ఆమ్లాన్ని లీటరు నీటికి చొప్పున కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

వరిలో..



నారు మడి గానీ, నేరుగా విత్తిన వరి పంటలో నీరు బయటకి పోవడానికి చర్యలు తీసుకోవాలి. సెంటు నారుమడికి అర కిలో యూరియా, పావు కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ చొప్పున వేయాలి.

‘భవనాశి’ ఉగ్రరూపం

- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- మునిగిన పొలాలు, ఇటుక బట్టీలు
- క్రస్టుగేట్ల ద్వారా 1000 క్యూసెక్కుల నీటి విడుదల


వరద రాజస్వామి ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల


ఆత్మకూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న పడేవాగు

ఆత్మకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో ప్రవహిస్తున్న భవనాశి నది ఉగ్రరూపం దాల్చింది. ఆత్మకూరు పరిసర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి అధికంగా వర్షపాతం నమోదు కానప్పటికీ నల్లమలలో కురిసిన భారీ వర్షాలతో భవనాశి ఉధృతంగా ప్రవహించింది. దీనికితోడు వరద రాజ స్వామి ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేశారు. దీంతో ఆత్మకూరు పట్టణం నుంచి కురుకుంద, కొట్టాలచెరువు గ్రామాలతో పాటు కొత్తపల్లి మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నది పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు, ఇటుకల బట్టీలు కూడా నీట మునిగాయి. భవనాశి సమీపంలోనే ఉన్న పడేవాగులో కూడా నీటి ప్రవాహం కొనసాగింది. బుధ వారం ఉదయం వరద ఉధృతి లేనప్పటికీ సాయంత్రానికి వంతెనపై నీటి ప్రవాహం ఉండటంతో రాకపోకలు కొనసాగించిలేని పరిస్థితి. ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీడీవో ఉమర్, రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్సై నారాయణరెడ్డి భవనాశి ఉధృతిని పరిశీలించి ఎలాంటి రాకపోకలు జరగకుండా చర్యలు చేపట్టారు.

వీఆర్‌ఎస్పీలో ప్రస్తుతం 369.5 అడుగుల నీటి నిల్వలు

నల్లమలలో కురిసిన భారీ వర్షంతో ఆత్మకూరు మండలంలోని వరద రాజ స్వామి ప్రాజెక్ట్(వీఆర్‌ఎస్పీ)లోకి భారీగా వర్షపు నీరు చేరింది. ప్రాజెక్ట్ గరిష్ట నీటిమట్టం 370మీటర్లకు గానూ ప్రస్తుతం 369.5 అడుగుల మేర నీటినిల్వలు ఉన్నాయి. అదేక్రమంలో ప్రాజెక్ట్‌లో గరిష్ట స్థాయిలో 0.38 టీఎంసీల నీటి ఉండటంతో మునిమడుగుల వాగుకు రెండు క్రస్టుగేట్ల ద్వారా 1000 క్యూసెక్కుల నీటి విడుదల చేపడుతున్నారు. ఆయకట్టు పంటలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా నీటి విడుదల కొనసాగిస్తున్నారు.


భవనాశి ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎస్ఐ

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- కేఎంసీ ప్రిన్సిపాల్
- మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ వీక్


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టి నరసమ్మ హెచ్చరించారు. యాంటి ర్యాగింగ్ వీక్ సంబరంగా దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలో యూజీసీ, నేషనల్ మెడికల్ కమిషన్ ఆదేశాల మేరకు కర్నూలు మెడికల్ కాలేజీలో జూమ్‌లో ర్యాగింగ్ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా యాంటి ర్యాగింగ్‌పై ఎన్ఎంసీ చైర్మన్ డా.అబిజిత్ సేత్ ప్రతిజ్ఞ చేయించారు. ఆగస్టు 12 నుంచి 18 వరకు యాంటి ర్యాగింగ్ వారోత్సవాలు నిర్వహించాలని ప్రిన్సిపాల్ తెలిపారు. ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలను చట్టం ద్వారా తీసుకునే కఠినమైన చర్యల గురించి విద్యార్థులకు వివరించాలన్నారు. వారోతసవాల సందర్భంగా డిజిటల్ పోస్టర్లు, షార్ట్ వీడియోలు, యాంటి ర్యాగింగ్ సందేహాలను హైలెట్ చేసే రీల్స్‌పై దృష్టి పెట్టాలన్నారు. ర్యాగింగ్ వ్యతిరేక సందేహాలను ప్రోత్సహించే సంస్థల నుంచి వీడియో సందేశాలను వినియోగించుకోవాలన్నారు.జూమ్ మీటింగ్‌లో వైస్ ప్రిన్సిపల్ డా.హరిచరణ్, డా.సాయిసుధీర్, డా.రేణుకాదేవి, డా.సింధియా శుభప్రద, యాంటి ర్యాగింగ్ సభ్యులు హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, పీజీలు, యూజీ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని పరిరక్షించాలి

- ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్

కర్నూలు న్యూసిటీ/కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యారంగాన్ని పరిక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాసర్‌జీ డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ 90వ వార్షికోత్సవం సందర్భంగా బుధవార నగరంలోని సీఆర్ భవన్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దేశంలో శాస్త్రీయ విద్యావిధానం అమలు కావాలని, అందరికీ సమాన హక్కులు కల్పించాలని కోరారు. అందరూ చదువుకోవడానికి అవకాశాలు ఏర్పాటు చేయాలన్నారు. నూతన జాతీయ విద్యావిధానం వల్ల విద్యా వ్యవస్థ నాశనం అవుతుందన్నారు. విద్యావిదానంలో సంస్కరణలు కావాలి గానీ, విద్యావ్యవస్థ నాశనం అయ్యే నిర్ణయాలు తీసుకోకూడదని తెలిపారు. దేశంలో మెడికల్ వ్యవస్థ పూర్తి స్థాయిలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు అందకుండా ఈ ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని మండిపడ్డారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా 30 మంది ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సోమన్న, శాబీర్‌బాషా, జిల్లా ఆఫీస్ బేరర్స్ రంగస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతీ శుక్రవారం ‘మండల గ్రీవెన్స్’

- ఈనెల 22 నుంచి ప్రారంభం
- హాజరుకానున్న జేసీ, సబ్ కలెక్టర్, ఆర్డీవో, జిల్లా రెవెన్యూ అధికారులు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతుల భూముల సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో ప్రతి శుక్రవారం ఒక మండలంలో గ్రీవెన్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జిల్లా రెవెన్యూ శాఖాధికారులు బుధవారం తెలిపారు. ఈ మేరకు 22నుంచి మండల గ్రీవెన్స్ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఈ గ్రీవెన్స్‌కు జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీవో అధికారులు హాజరు కానున్నారు. ప్రతి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో రైతుల నుంచి అర్జీలను అధికారులు స్వీకరించనున్నారు. రైతులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని వారు పేర్కొన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి సంబంధించి వీఆర్వో, గ్రామ సర్వేయర్, మండల సర్వేయర్, మండల తహసీల్దార్, గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ నెల 22న సి.బెళగల్, 29న ఆలూరరు, సెప్టెంబరు నెలకు సంబంధించి 12న గోనెగండ్ల, 19న వెల్దుర్తి, అక్టోబరు 3న హాలహర్వి, 10న పెద్దకడుబూరు, 17న కోడుమూరు, 24న దేవనకొండ, 31న మంత్రాలయం, 14న తుగ్గలి, 21న కౌతాళం, 28న కల్లూరు, డిసెంబరు 5న క్రిష్ణగిరి, 12న హోళగుంద, 19న ఓర్వకల్లు, 16న మద్దికెర, 2026 సంవత్సరం జనవరిలో 2వ తేదీ నందవరం, 9న కర్నూలు రూరల్; 23న చిప్పగిరి, 30న ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 6న కర్నూలు అర్బన్, 13న పత్తికొండ, 20న కోసిగి, 27న ఆస్పరి, మార్చి 3న ఆదోని మండలంలో గ్రీవెన్స్ కార్యక్రమం జరగనుంది.

రైతులకు ఉపయోగం



రాష్ట్రంలో కర్నూలు జిల్లాలో రైతుల భూ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటుచేయడం రైతులకు ఎంతో ఉపయోగకరం. ప్రతి సోమవారం భూ సమస్యల పరిష్కారం కోం జిల్లా కేంద్రానికి రావాలంటే రైతులకు ఆర్థికపరంగా కొంత ఇబ్బందిగా ఉంది. ప్రతి మండలంలో గ్రీవెన్స్ ఏర్పాటు చేయడంతో భూసమస్యలు పరిష్కారం అవుతాయి.
- యోగేష్, జాతీయ లంబాడీ సంఘం కార్యదర్శి

ఫిర్యాదు ధృవీకరణ పత్రమివ్వాలి



జగనన్న భూసర్వేలో అనేక తప్పులు దొర్లాయి. దీంతో రైతులకు భూ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. ప్రతి మండలంలో శుక్రవారం భూ సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ ఏర్పాటుచేయడంతో రైతుల సమస్యలను రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో పరిష్కారం అవుతాయి. ఈసారైనా రైతులకు ఫిర్యాదు ధృవీకరణ పత్రం ఇవ్వాలని సూచించారు. **- భాస్కర్, సీపీఐ ఎంఎల్, న్యూడెమొక్రసీ**

'గురురాజా'లో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి

నంద్యాలఎడ్యుకేషన్,ఆగస్టు13(ఆంధ్రజ్యోతి):నంద్యాల గురురాజా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు నిర్వహించిన కృష్ణుని వేషధారణలు, గోపికల ప్రదర్శనలు, ఉట్టికొట్టే సన్నివేశాలు, గోపికలు బాలకృష్ణులతో నృత్యాలు ఆకట్టుకున్నాయి. షేక్షావలిరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు మన సంస్కృతీ సంప్రదాయాలు తెలిసేలా కార్యక్రమాలను నిర్వహించామన్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి: సీపీఐ

నందికొట్కూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెలసిన అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ బేబీకి బుధవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం సీపీఐ నాయకులు రఘురాంమూర్తి, పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలో దాదాపు 21 చోట్ల 220 ఎకరాల్లో నిబంధలకు అక్రమ వెంచర్లు వెలిశాయన్నారు. వ్యవసాయ భూమిని, వ్యవసాయేతర భూమిగా మార్చకుండా, రెవెన్యూ శాఖకు, మున్సిపాల్టీకి చెల్లించాల్సిన 10 శాతం భూమి ఇవ్వకుండా, వెంచర్ అనుమతికి చలానాలు చెల్లించకుండా మున్సిపాలిటీ ఆదాయానికి గండికొడుతున్నారన్నారు. రియల్టర్లు ఇళ్లస్థలాలను లక్షల రూపాయలకు క్రయవిక్రయాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి: తహసీల్దార్

పాణ్యం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): పాణ్యం సమీపంలోని ఎస్సార్ పెట్రోల్ బంకు ఎదురుగా హైవే రహదారి పక్కన నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాలని తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి హెచ్చరించారు. రైతుల ఫిర్యాదు మేరకు బుధవారం పెట్రోల్ బంకు ఎదురుగా హైవేపై నిర్మించిన కట్టడాన్ని ఆయన పరిశీలించారు. ఈ నిర్మాణం వల్ల ఎద్దుల బండ్లకు, రాకపోకలకు అవరోధం ఏర్పడుతుందన్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లాలంటే ఈ నిర్మాణంతో యూటర్న్ తీసుకొని వెళ్లాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో వేగంగా వెళ్లే వాహనాల బారినపడి రైతులు మృత్యువాత పడే ప్రమాదముందన్నారు. రెండు రోజుల్లో తొలగించని పక్షంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామన్నారు. మండల సర్వేయరు నాగరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



హైవేపై అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

గడివేముల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని గడివేముల సీఐటీయూ ఆటో యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పాతబస్టాండు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు గోకార్స, రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఆటోకార్మికులపై వేస్తున్న చలానాలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు చంద్ర, సామన్న పాల్గొన్నారు.

సమాచార హక్కు వజ్రాయుధంలాంటిది

బండిఆత్మకూరు ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సమాచార హక్కు వజ్రాయుధం లాంటిదని సీఈఓ గోపాల్ అన్నారు. బుధవారం సంతజూటూరులో ఉన్న పరమటూరు రైతు సేవాసహకార సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సమాచార కమిషనర్ సునీల్, జిల్లా సహకార అధికారి రామాంజనేయులు ఆదేశానుసారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ కార్యాలయంలోనైనా, ఎలాంటి సమాచారం తెలుసుకోవాలన్నా సమాచార హక్కు చట్టం ద్వారా వీలవుతుందన్నారు. సిబ్బంది విజయ్‌కుమార్, రామకృష్ణ పాల్గొన్నారు.

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

ఆత్మకూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాల జోలికెళ్లి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఆత్మకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐలు జగదీష్, వీరస్వామి విద్యార్థులకు సూచించారు. బుధవారం ఎక్సైజ్ సూపరిండెంట్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మద్యపానం, నాటుసారా, మత్తు కలిగించే పదార్థాలను వినియోగించడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మద్యం, మత్తు పదార్థాలకు బానిసకావడం వల్ల సామాజికంగా, ఆర్థికంగా, ఆరోగ్యపరంగా అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

మాదక ద్రవ్యాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

● ఎక్సైజ్ ఎస్ఐ జప్రుల్లా

నందికొట్కూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఎస్ఐ జప్రుల్లా పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీనంది జూనియర్ కళాశాలలో నిర్వహించిన నాశముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు లేని సమాజం, జిల్లాను, రాష్ట్రాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. నంది జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఏవో జయచంద్ర, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షితమైన వాతావరణం కల్పించాలి

పాణ్యం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని ఉమెన్స్ ఇన్ డేటా సైన్స్ (విడ్స్)గూగుల్ డెవలపర్ నిపుణురాలు, చీఫ్ డేటా సైంటిస్ట్ ఉషా రెంగరాజు పేర్కొన్నారు. బుధవారం ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ (డేటా సైన్స్)విభాగం ఆధ్వర్యంలో ఉమెన్స్ ఇన్ డేటాసైన్స్ సదస్సు ప్రారంభించారు. ఈ సదస్సులో గూగుల్ డెవలపర్ గ్రూప్ మేనేజరు రాధికాకన్నన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశంలో నాలుగవ చాప్టర్‌గా గుర్తింపు పొందిన విడ్స్ క్యాంపస్ అంబాసిడర్‌గా ఆర్జీఎం కళాశాల విద్యార్థిని శైలజ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషా రెంగరాజు మాట్లాడుతూ మహిళల సమస్యలు డేటా సైన్స్ ద్వారా ప్రత్యక్షంగా పరిష్కరిచగలుగుతామన్న విషయం సదసు ద్వారా వెల్లడైందన్నారు. విడ్స్ ద్వారా మహిళలకు సురక్షితమైన వాతావరణం, రక్షణ కల్పించాల్సి ఉందన్నారు. కళాశాల ఎండీ శివరాం, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్, డీన్ అశోక్ కుమార్, భాస్కరరావు, విక్రమ్‌చంద్ర పాల్గొన్నారు.

వానొస్తే వాళ్లకు వణుకే..

● ఇళ్లలోకి చేరుతున్న వరద నీరు
● ఆందోళనలో ప్రజలు
● నందికొట్కూరు పట్టణ శివారు ప్రాంతాల పరిస్థితి ఇదీ..

వానొస్తే ఎవరైనా సంతోషిస్తారు.. తాగు,సాగు నీటి సమస్య తీరుతుందని, పొలాలు సస్యశ్యామలమై బతుకు బాగుపడుతుందని ఆనందిస్తారు.. ఇక్కడి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కొద్దిపాటి వర్షం కురిసినా నివాస ప్రాంతాలు జలమయమవుతాయి. దీంతో అక్కడి వారు వానొస్తే వణికిపోతున్నారు. ఈ దుస్థితి మరెక్కడో కాదండీ... మన నందికొట్కూరు శివారు ప్రాంతాల్లోనే..



నందికొట్కూరు: జనావాసాల్లోకి వచ్చిన వరద నీటిని చూపుతున్న మారుతీనగర్ వాసులు



డ్రైనేజీలు నిండి రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపు నీరు

నందికొట్కూరు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని శివారు కాలనీల్లో ఎప్పుడు వరద వస్తుందో అర్థంకాని పరిస్థితులున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరద నీరు రావడంతో మారుతీనగర్ జలమయమైంది. వర్షాకాలం వచ్చిందంటే వరద నీటితో సాహవాసం చేయడం తమకు పరిపాటిగా మారిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎగువన కురిసే వర్షాలకు మారుతీనగర్‌లోని జనావాసాల్లోకి వరద నీరు చేరుతుంది. అందులో భాగంగా బుధవారం వరద నీరు మారుతీనగర్‌లోని లోతట్టు కానీల్లోకి చేరింది. దీంతో జనం ఇబ్బందులు పడుతు న్నారు. వరద నీరు వెళ్లేందుకు ముళ్ల కంపలను తొలగించి, రోడ్డుకు ఇరువైపులా కాలువలు తీస్తామని మున్సిపల్ అధికారులు చెప్పి మూడు రోజులు అవుతున్నా నేటికీ దిక్కులేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీవనగండ్లలో కురిసిన వర్షాలకు వరద నీరు ఇళ్లలోకి చేరుతోంది. లోతట్టు ప్రాంతంలో కాలనీల్లో రోడ్డు వేసి, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేస్తే వరద నీరు తగ్గుతుందని కాలనీ వాసులు కోరుతున్నారు.

కొన్నేళ్లుగా తిష్టవేసిన సమస్యలు

పట్టణ శివారు కాలనీల్లో ఏళ్ల తరబడి సమస్యలు తిష్టవేశాయి. మారుతీనగర్‌లో శివారు కాలనీల్లో కనీస వసతులు లేక ఆయా కాలనీల వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. గత కౌన్సిల్ ఎన్నికల ముందు రోడ్లు వేస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్న వైసీపీ తమను మోసం చేసిందన్నారు. సీసీ రోడ్డు మంజూరైన రాజకీయ జోక్యంతో వేయలేదన్నారు. కాలనీలో పిచ్చిమొక్కలు మొలిచాయని, పాములకు ఆవాసాలుగా మారాయని అధికారులు కాలనీవాసులు పేర్కొంటున్నారు. వర్షపు నీటితో మారుతీనగర్, హాజీ నగర్ జలమయమవుతాయన్నారు. వర్షపు నీటిని తరలించేందుకు అప్రోచ్ కాలువలను పూర్తి స్థాయిలో నిర్మించకపోవడంతోనే ఈ సమస్య నెలకొందన్నారు.

పాములపాడులో నీట మునిగిన మొక్కజొన్న



భారీ వర్షాల వల్ల పాములపాడు నుంచి చెలిమిల్ల రస్తాలో గల ఎద్దుల వంక వాగు, సుద్దవాగు పొంగి ప్రవహిస్తుండటంతో మొక్కజొన్న పంటలలోకి నాలుగు, ఐదు అడుగులు నీరుచేరింది. ఇస్కాల గ్రామ శివార్లలోని భవనాశి వాగు ఉప్పొంగడంతో అక్కడి పొలాలు మునిగి పోవడమే కాక శ్రీ నందీశ్వర ఆలయం నీట మునిగింది. దుద్యాలతో పాటు కొత్తపల్లి మండలానికి రాకపోకలు నిలిచి పోయాయి



నందికొట్కూరు: వరద నీటిలో సిలిండర్ మోసుకెళుతున్న దృశ్యం

వర్షపు నీరు ఇళ్లలోకి వస్తోంది



బుధవారం ఉదయం మారుతీనగర్ ఎగువన కురిసిన వర్షాలకు వరద నీరు మారుతీనగర్‌లో ఇళ్లచుట్టూ ప్రవహిస్తోంది. డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అధికారులు పట్టించుకోవడం లేదు. మారుతీనగర్ లోతట్టు ప్రాంత వాసులంటే అటు అధికారులకు.. ఇటునాయకులు చిన్నచూపు ఎందుకో..! ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అయినా మా సమస్య తీర్చాలి.- హుస్సేన్‌బాషా, మారుతీనగర్

నందికుంటలో వరద నీటిని తొలగించిన అధికారులు

కొత్తపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని నందికుంట శివారులోని ప్రభుత్వ పాఠశాల నుంచి గ్రామంలోకి వచ్చి చేరిన నీటిని అధికారులు బయటికి పంపించారు. ఈ సమస్యపై బుధవారం ఆంధ్రజ్యోతిలో 'నందికుంటలో జలమయమైన రహదారులు, ఇబ్బందులు పడుతున్న ప్రజలు' అన్న కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అధికారులను అప్రమత్తం చేశారు. స్థానిక టీడీపీ నేత జప్రుల్లా పర్యవేక్షణలో అధికారులతో పాటు గ్రామస్థులు సైతం సహకారం అందించారు. కుంటలోని నీటిని బయటకు పంపేందుకు డ్రైనేజీ కాలువల్లో పూడికను తొలగించారు. ఎట్టకేలకు వర్షం నీరు డ్రైనేజీ ద్వారా గ్రామశివారులోని సుద్దవాగులోకి చేరేవిధంగా చర్యలు చేపట్టారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఆలంబాషా, ఈవోఆర్‌డీ సుబ్బారావు, పీఆర్ఏఈ మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శులు పార్థసారధి, చిన్నస్వామి, వీఆర్వో కృష్ణారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అలీబాషా, గ్రీన్ అంబాసిడర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.



వర్షం నీటిని డ్రైనేజీల ద్వారా బయటకు పంపిస్తున్న అధికారులు

అమెరికా షరతులకు తలొగ్గకూడదు

● వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు

నందికొట్కూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అమెరికాతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌కు ప్రధాని నరేంద్రమోదీ తలొగ్గడం సరికాదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం వ్యవసాయ సంస్కరణలకు సంబంధించిన ప్రతులను వారు దహనం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్ సాహెబ్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతూ స్వామినాథం కమిషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు, వ్యాకాసం, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.



ప్రతులను దహనం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

జీరో ట్యాక్స్ దిగుమతులను వ్యతిరేకించాలి

ఆత్మకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): అమెరికా నుంచి జీరో ట్యాక్స్ ఆహార ధాన్యాల దిగుమతులను వ్యతిరేకించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు.బుధవారం అమెరికాతో ఫ్రీ ట్రేడింగ్ అగ్రిమెంట్‌ను వ్యతిరేకిస్తూ రైతు, కౌలు రైతు, వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.ఆయా సంఘాల నాయకులు రామ్‌నాయక్, సద్దాం, రణధీర్, సురేంద్ర, వీరన్న, మాబాషా, స్వాములు, దాసు, కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

సాక్షి గణపతికి విశేష పూజలు

నంద్యాల కల్చరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో బుధవారం సాక్షి గణపతికి విశేష పూజల నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లోక శాంతి దుర్భిక్షనివారణ కోసం శ్రీశైల దేవస్థానానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి పక్కన ఉన్న వీరభద్రస్వామికి విశేష అభిషేకం, పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తికావాలి

● కలెక్టర్ రాజకుమారి



గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో డిసెంబర్ నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణ శాఖ అధికారులను కలెక్టర్ రాజకుమారిగణియా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ గృహ నిర్మాణాలపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పేదవాడికీ ఇళ్లు నిర్మించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లాకు మొత్తం 59,239 ఇళ్లు మంజూరు కాగా నేటివరకు 31,682 ఇళ్లు మాత్రమే పూర్తయ్యా యని, మిగిలిన వాటి నిర్మాణాలను డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని ఆదే శించారు. గతంలో అడ్వాన్స్ పేమెంట్ చేసిన వాటి నిర్మాణాలు పూర్తయ్యేలా దృష్టిసారించాలన్నారు. ఐహెచ్‌హెచ్ఎల్ టాయిలెట్స్ జిల్లాకు 23707 మజూరయ్యాయని, అందులో 11661 పూర్తి చేసినట్లు తెలి పారు. మిగిలిన వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పీఎం జన్‌మన్, ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద జిల్లాలో చెంచులకు 526 ఇండ్లు మంజూరు కాగా 221 పూర్తయ్యాయని, మిగిలిన వాటిని కూడా పూర్తి చేయాలని కోరారు.

స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల ఏర్పాట్లను బుధవారం జేసీ విష్ణుచరణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. పతాకావిష్కరణ, సాయిధ దళాల మార్చ్‌ఫాస్ట్, వేదిక, సమర యోధుల సన్మానం వంటి ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శనను చూపరులను ఆకట్టుకునేలా ఉండాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలపై ఏర్పాటు చేసే ఛాయాచిత్ర ప్రదర్శనలు, అధికారులకు, వీఐపీలకు గ్యాలరీలు ఏర్పాటుచేసి మంచినీటి వసతి కల్పించాలని ఆదేశించారు.

కేసు నమోదు

మహానంది, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థానం తీర్పు మేరకు తన పొలంలోకి వెళ్లిన ముంతాజ్ బేగం అనే మహిళను అడుకున్న వైసీపీ నాయకుడు శరభారెడ్డితో పాటు అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి బుధవారం రాత్రి తెలిపారు. నూనేపల్లికి చెందిన ముంతాజ్ బేగం అనే మహిళకు మహానంది మండలం బుక్కాపురం రెవెన్యూ పరిధిలోని 380-1ఎ సర్వే నెంబర్‌లో 2 ఎకరాల భూమిని ఆమె తండ్రి ఆర్మీ ఉద్యోగి కావడంతో ప్రభుత్వం కేటాయించింది. తద్వారా ఆమెకు ఆ ఆస్తి సంక్రమించిందని ఎస్ఐ తెలిపారు.అయితే తన పొలాన్ని అబ్బీపురం వైసీపీ నేత శరభారెడ్డి దౌర్జన్యంగా స్వాధీనం చేసుకోవడంతో కోర్టును ఆశ్రయించిందని, ముంతాజ్ బేగంకు అనుకూలంగా కోర్టు తీర్పు ఇచ్చింద న్నారు. అయితే పొలంలోనికి వెళ్లకుండా వైసీపీ నాయకుడు శరభారెడ్డితో పాటు అతని అనుచరులు అడ్డుకొన్నారని బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

నంద్యాల టౌన్, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో టిడ్కో జీ ప్లస్ 3 ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని నంద్యాల మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన పత్రాలు తీసుకుని సచివాలయాల్లో 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాణ్యం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి):కార్పొరేట్ పాఠశాలలో ఉచిత విద్య కోసం ప్రభుత్వం మరోసారి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిందని ఎంఈవో సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల ఎంపిక లాటరీ పద్ధతి ద్వారా ఉంటుందన్నారు. ఈనెల 20న ఎంపిక, 31 వతేదీన పాఠశాల ప్రవేశాలు జరుగుతాయన్నారు.

పంచాయతీ ప్రగతి సూచికపై శిక్షణ

పగిడ్యాల, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల ప్రగతి సూచికపై బుధవారం శిక్షణ ఇచ్చినట్లు ఎంపీడీవో సుమిత్రమ్మ తెలిపారు. పగిడ్యాల ఎంపీడీవో కార్యాలయంలో గ్రామాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీటిని బయటకు పంపండి

కొత్తపల్లి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లో నిలిచిపోయిన వర్షం నీటిని తక్షణమే కాలువల ద్వారా బయటకు పంపాలని ఏవో అమీరున్నీసా బేగం రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాల్లో నీట మునిగిన మొక్కజొన్న, వరి, పత్తి పంట పొలాలను పరిశీలించారు.ఆమె మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి కాపాడుకోవాలన్నారు. ఏఈవో నాగశ్రీ, రైతు సేవా శ్రీనివాసులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగించుకోండి

వెలుగోడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణను అధికారులు, ప్రజాప్రతినిధులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీలకు జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు వర్క్‌షాపు నిర్వహించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



దుకాణాలను తనిఖీ చేస్తున్న డీఏవో

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి మున్నా వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో ధ్రువపత్రాలను, స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్స్, భౌతిక నిల్వలు, స్టాక్ వివరాలను డీఏవో పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ ప్రతి దుకాణదారుడు వ్యవసాయశాఖ అనుమతులు ఉన్న ఎరువులు, పురుగుల మందులు మాత్రమే విక్రయించాలని, ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. ఎరువుల దుకాణాల యజమానులు ఐఎఫ్ఎంఎస్ యంత్రం, ఫిజికల్ స్టాక్ రిజిస్టర్ స్టాక్‌లు సమానంగా ఉండేలా చూసుకోవాల న్నారు. ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి గరిష్ట ధర కన్నా ఎక్కువగా అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీలో ఏడీఏ ఆంజనేయ, మండల వ్యవసాయాధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించండి

ఆత్మకూరు, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ తిరుపాలమ్మ పేర్కొన్నారు. స్థానిక మం డల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆయా శాఖల అధికారులు బాధ్యతగా వ్యవహరించి ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ, వైద్యాధికారులు శ్రద్ధ వహించాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో ఉమర్, ఏవో హేమలత, ఏపీఎం కాశి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా ఉదయాన్నే మండల మీట్ జరగాల్సి ఉన్నప్పటికీ సభ్యుల కోరం లేకపోవడంతో మధ్యాహ్నం నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపాలమ్మ

పంచాయతీల పురోగతిపై అవగాహన అవసరం

పంచాయతీ పురోగతిపై ఆయా శాఖల అధికారులు అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో ఉమర్ పేర్కొన్నారు. ఈ బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఆయా శాఖల అధికారులకు పంచాయతీ పురోగతి సూచిక సంబంధించి వర్షన్ 1.0 నుంచి 2.0కు పరివర్తన వ్యాప్తికి సంబంధించి ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. తహసీల్దార్ రత్నరాధిక, ఎంపీపీ తిరుపాలమ్మ, ఆయాశాఖల అధికారులు ఉన్నారు.

జూపాడుబంగ్లా: గ్రామపంచాయతీల్లో ప్రజలకు సుస్థిరపాలన అందించడానికి అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీవో గోపీకృష్ణ అన్నారు. పంచాయతీ పురోగతి సూచిక, పరివర్తన వ్యాప్తిపై ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను ఉపయోగించి పంచాయతీ అభివృద్ధికి కృషిచేయాలన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, పీఆర్ఏఈ బషీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర, డిప్యూటీ ఎంపీడీవో పద్మావతి, ఏపీవో రేష్మా, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఇంజినీరింగ్ అసిస్టంట్లు పాల్గొన్నారు.

కొత్తపల్లి : గ్రామ పంచాయతీల అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని తహసీల్దార్ ఉమారాణి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఆలంబాషా సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో డిప్యూటీ ఎంపీడీవో సుబ్బారావు అధ్యక్షతన పంచాయతీల పురోగతి, బడ్జెట్‌లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు, పంచాయతీల కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

వాహనం సీజ్

● మరో వాహనానికి రూ.20,460 జరిమానా

చాగలమర్రి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో ఒకే ప్లేట్ నంబర్‌తో రెండు వాహనాలు నడుపుతూ ఈనెల 8న పోలీసులకు పట్టుబడిన విషయం విదితమే. నంద్యాల ఆర్టీవో కార్యాలయ అధికారి పట్టుబడ్డ వాహనాలను తనిఖీ చేసి ఏపీ39 యూఎన్5808 నంబర్ కలిగిన వాహనానికి ట్యాక్సు, పరిమిట్ లేకపోవడం, రికార్డులు సరిగా లేకపోవడంతో రూ.20,460 జరిమానా విధించారు. అదే నంబర్‌తో తిరుగుతున్న మరో వాహనాన్ని సీజ్ చేశామని బుధవారం ఎస్ఐ సురేష్ తెలిపారు. నంద్యాల ఆర్టీవో కార్యాలయ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అక్రమంగా తిరుగుతున్న వాహనంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పంట నమోదు తప్పనిసరి

దొర్నిపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని వ్యవసాయాధికారి ప్రమీల అన్నారు. బుధవారం మండలంలోని క్రిష్టిపాడు, డబ్ల్యూగోవిందిన్నె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. నానో యూరియా, నానో డీఏపీ వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

ఆందోళనలో మిరప రైతు

రుద్రవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో మిరప రైతు ఆందోళనలో పడ్డాడు. వర్షం ధాటికి మిరప దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రుద్రవరం, రెడ్డిపల్లె, నాగలవరం, ఆలమూరు, నరసాపురంం, చందలూరు, మందలూరు చిత్తరేణిపల్లె గ్రామాల్లో రైతులు సుమారు 700 ఎకరాల్లో మిరప పంటను సాగు చేశారు. వర్షాల ధాటికి దెబ్బతింటుందని వాపోతున్నారు. ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టామని వాపోయారు. నష్టపోతే ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

సింగిల్ విండో చైర్మన్‌గా మోహన్ రెడ్డి



సంజామల, ఆగస్టు13(ఆంధ్రజ్యోతి): ఆకుమల్ల సింగిల్ విండో చైర్మన్‌గా ఉప్పలూరి మోహన్ రెడ్డి నియమితులైయ్యారు. బుధవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. నట్లకొత్తూరు గ్రామానికి చెందిన మోహన్ రెడ్డి గత 15 సంవత్సరాలుగా టీడీపీలో పనిచేస్తూ వచ్చారు. త్వరలో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనున్న మోహన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విజ్ఞాన మేళా ఎంతో అవసరం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న మారుతి కృష్ణన్, మధుమోహన్ రెడ్డి

బేతంచెర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యాబోధనతో పాటు సమగ్ర వికాసం, విజ్ఞానాన్ని పెంపొందించే విజ్ఞాన మేళాలు ఎంతో అవసరమని సరస్వతి విద్యాపీఠం కార్యదర్శి పోలేపల్లి సందీప్ అన్నారు. బుధవారం పట్టణంలోని సరస్వతి శిశు మందిరం మాధ్యమిక పాఠశాలలో ఉమ్మడి జిల్లాల విద్యార్థుల విజ్ఞాన మేళా నిర్వహించారు. మేళాకు 13 పాఠశాలల నుంచి 181 మంది విద్యార్థులు పాల్గొని సైన్స్, వేద గణితంలో తమ ప్రదర్శనలు నిర్వహించారు. విజేతలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మారుతి కృష్ణ, హుశేన్‌రెడ్డి, పుల్లారెడ్డి, బుగ్గన రమణారెడ్డి, మధుమోహన్‌రెడ్డి, నాగమోహన్, బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, రోటరీ సభ్యులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మహాగౌరీ వ్రతం

చాగలమర్రి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సంయోజిత కన్వీనర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మహామంగళగౌరీ వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి రంగు రంగుల పట్టు చీరలతో అలంకరింప చేశారు. సామూహికంగా వడిబియ్యం కార్యక్రమం చేశారు. చీర, సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన ఉండాలి

దొర్నిపాడు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల రైతులు సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలని కొండాపురం సహకార సంఘ కమిటీ సీఈవో సైపుల్లాబేగ్ అన్నారు. బుధవారం సొసైటీ ఆవరణలో రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో కేసీకెనాల్ సాగునీటి అధ్యక్షుడు నాగలింగేశ్వర్‌రెడ్డి, సిబ్బంది ఆనందరెడ్డి, జమాల్, రైతులు పగిడెల శివశంకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హనుమంతరావు, కృష్ణారెడ్డి, సాయిరామకృష్ణ తదితరులున్నారు.

పెండింగ్ డీఏలు వెంటనే చెల్లించాలి

బనగానపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే చెల్లించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బనగానపల్లె ఆర్టీసీ డిపో గేటు వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. నేషనల్ మజ్దూర్ యూనియర్ డిపో రీజనల్ సభ్యులు వలి, రాష్ట్ర ఉప కార్యదర్శి భద్రావతి మాట్లాడుతూ పీఆర్‌సీ కమిటీ వెంటనే వేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రీజనల్ సభ్యులు ఎల్లయ్య, ప్రెసిడెం ట్ జముమ్లయ్య, గ్యారేజీ సెక్రటరీ దేవేంద్రరెడ్డి, గఫర్, ప్రహ్లాద, ఓబులేసు, రఫీ, నాయక్, తిరుపాల్ , అధిక సంఖ్యలో డిపో కార్మికులు పాల్గొన్నారు.

శిక్షణను జయప్రదం చేయాలి

బేతంచెర్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జనసేవాదళ్ శిక్షణా శిబిరాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు కోరారు. బుధవారం సీపీఐ మండల ప్రధాన కార్యదర్శి భార్గవ్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రంగనాయుడు హాజరై మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర మహాసభలు ఒంగోలు పట్టణంలో ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర, జిల్లా సీపీఐ నాయకులు హాజరవుతారని, యువకులు జయప్రదం చేయాలని కోరారు.నాయకులు తిరుమలేష్, దస్తగిరి, నాగరాజు, ఉదయ్, ప్రదీప్, నాగేశ్వరరావు, సోమన్న, శ్రీరాములు బాలు, మారుతి పాల్గొన్నారు.

45 మంది రక్తదానం

డోన్ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం కొరియోగ్రాఫర్ ఎంపీ చరణ్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 45మంది స్వచ్ఛందగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో రిజర్వేషన్ పోరాట సమితి రాయలసీమ అధ్యక్షుడు శంకర్‌గౌడు, ఆర్థో వెంకటరమణ, ఎన్ఎల్ మధుసూదన్, నాయకులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

చాగలమర్రి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డీలర్లు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సమయపాలన పాటించి రేషన్ పంపిణీ చేయాలన్నారు.

కనుమరుగవుతున్న ఆయుర్వేద వైద్యం..!

- నాడు వందలాది మందితో కళకళ
- నేడు రోగులు లేక వెలవెల
- ఒకేఒక డాక్టర్ విధులు
- నూతన భవనం నిర్మించినా ప్రారంభానికి నోచుకోని వైనం

రాయలసీమ జిల్లాల్లోనే పేరు ప్రఖ్యాతి గాంచిన బనగానపల్లె ఆయుర్వేద వైద్యశాల. నాడు వందలాది రోగులతో కళకళలాడిన బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాల నేడు రోగులు లేక వెలవెలబోతోంది. అప్పట్లో రోజుకు వందల సంఖ్యలో రోగులు రాయలసీమ జిల్లాల నుంచేగాక ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి పెద్ద సంఖ్యలో వచ్చి దీర్ఘకాలిక రోగాలను ఆస్పత్రిలో ఉండి నయం చేసుకునే వారు. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. పదుల సంఖ్యలో కూడా రోగులు రావడం లేదు.



ప్రారంభానికి నోచుకోని ఆయుర్వేద వైద్యశాల

బనగానపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోనే అతి పెద్ద ఆయుర్వేద వైద్యశాల బనగానపల్లెలో ఉంది. ఒకప్పుడు 10 పడకల ఆస్పత్రిగా ఖ్యాతి నొందింది. నేడు సిబ్బంది లేక ఆస్పత్రి వెలవెల బోతోంది. రోగులకు భోజనం కూడా వడ్డించే వారు. ఇక్కడే ఉంటూ దీర్ఘకాలిక రోగాలను నయం చేసుకుని వెళ్లే వారు. అలాంటి ఆస్పత్రి నేడు పతనావస్థకు చేరుకుంది. వైద్యశాల గదులు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇక్కడ పనిచేస్తున్న ఒకే ఒక డాక్టర్, సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు.



శిథిలావస్థలో బనగానపల్లె ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల భవనం

1982లో హంసానంద సరస్వతీ..

1982లో హంసానంద సరస్వతీ తన ఆశ్రమంలోని 9.6 ఎకరాలను ఆయుర్వేద వైద్యశాలకు 99సంవత్సరాలు ప్రభుత్వానికి లీజుకు ఇచ్చి ఆయుర్వేద వైద్యశాలను నిర్మించారు. ప్రభు త్వం ఆధ్వర్యంలో ఈ ఆయుర్వేద వైద్యశాల అప్పట్లో 10 పడకల ఆస్పత్రిగా ఏర్పాటు అయింది. రాయలసీమ జిల్లాలోనే ఈ ఆస్పత్రి ప్రఖ్యాతి చెందిన ఆస్పత్రి. రాయలసీమ జిల్లాల నుంచే గాక వివిధ ప్రాంతాల నుంచి రోగులు స్వల్ప, దీర్ఘకాలిక వైద్యం చేయించు కుంటూ ఇక్కడే ఉండి రోగాలను నయం చేసుకొని వెళ్లేవారు. ఇన్‌పేషంట్లకు భోజన వసతి కూడా ఉండేది. సిబ్బంది కొరతతో పాటు గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో స్టీమ్‌బాత్, మసాజ్ వంటి పంచకర్మ వైద్యవిధానికి ఫుల్‌స్టాప్ పడింది.

శిథిలావస్థకు భవనాలు

బనగానపల్లె ఆయుర్వేద వైద్యశాల పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. దాదాపు 43 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన భవనాలు కావడంతో సీనియర్ మెడికల్ వైద్యాధికారి భవనం పూర్తిగా కూలిపోయింది. ఔషధాలు నిలువ చేసే గదులు స్టీమ్‌బాత్, మసాజ్ లాంటి పురాతన వైద్య పరికరాలు సిబ్బంది కొరతతో మూలనపడ్డాయి. అలాగే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నా డాక్టర్‌ల గది, ఔషధాలు నిల్వ చేసే గది పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి మంచాలు తప్పుపట్టాయి. శిథిలావస్థకు చేరుకోవడంతో సిబ్బంది బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. భవనాల పై పెచ్చులు పూర్తిగా ఊడిపోయాయి. శిథిలావస్థకు చేరుకున్న గదుల్లో విషసర్పాలకు స్థావరంగా మారిపోయాయి.

సిబ్బంది అంతంత మాత్రమే..

బనగానపల్లె ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రస్తుతం ఒక డాక్టరు, ఒక స్వీపర్, ఒక జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 1 అటెండర్, గార్డెనర్, 1 ఎన్ఎఎం, 2 స్టాఫ్ నర్సులు, 2 కాంపౌం డర్‌లు, 1హెర్బేరియం,1 మసాజిస్టు, రెండు స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ శాఖలో పదవీ విరమణ అయితే మరొకరిని నియమించడం లేదు. దీంతో ఒకప్పుడు రాయలసీమలో ఒక వెలుగు వెలిగిన బనగానపల్లె ఆయుర్వేద ఆస్పత్రి ప్రాబవం తగ్గిపోయింది.

ప్రారంభమెప్పుడో..?

బనగానపల్లె ఆయుర్వేద వైద్యశాల పూర్తయినా ప్రారంభానికి నోచుకోలేదు. గతంలో విధులు నిర్వహించిన డాక్టర్ నాగరాజు ఆయుర్వేద ఆస్పత్రి భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపడంతో రెండేళ్ల క్రితం రూ.56.25 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఆ నిధులతో భవనం నిర్మాణం పూర్తయింది. అయితే ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు.

రైతు బాగుంటేనే.. దేశం బాగుంటుంది

- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి
- ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో భారీ ర్యాలీ
- ఉత్సాహంగా రైతు సంబరాలు



ఎడ్లబండి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల,తదితరులు

డోన్ టౌన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని ఎ మ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ పథకం నిధులు జమ కావడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతగా బుధవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో రైతు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భం గా రైతులు ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ముందుగా పట్టణంలోని ఐటీఐ కళాశాల ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అక్కడి నుంచి శ్రీరామ టాకీస్, ఎల్ఐసీ టా కీస్, రైల్వేగేట్ల మీదుగా వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు ర్యాలీ సాగింది. యార్డు ఆవరణలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ రైతుల కోసం కూటమి ప్రభుత్వం మాటలతో కాకుండా చేతులతో చూపిం చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే సాధ్యమన్నారు. ప్రతి రైతు కుటుంబానికి అన్నదాత సుఖీభవ పథకం కింద విడతల వారీగా రూ.20వేలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తాయన్నారు. రైతుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం మరిన్ని పథకాలు, సదుపాయాలను అందిం చేందుకు కృషి చేస్తున్నా మన్నారు. త్వరలో నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి తాగునీటి కొళాయిలు అందిస్తామని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటీని పూర్తి చేసిన ఘనత కూటమికే సాధ్యమన్నారు. పేద ప్రజలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు కూడా అందించేం దుకు కృషి చేస్తుందన్నారు. ఎన్నికల ముందు నంద్యాల జిల్లాలో డోన్ నియోజకవర్గం ఉందని, ఎన్నికల ముందు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం డోన్‌ను కర్నూలులో కలుపుతామని త్వరలో నెరవేరు స్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, కోట్రికే ఫణిరాజ్, వలసల రామకృష్ణ, లక్ష్మిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ టీఈ కేశన్నగౌడు, టీఈ పెద్ద కేశవయ్యగౌడు, అబ్బర్వర్ హరి, ఓబులాపురం శేషిరెడ్డి, విజయభట్టు, పీఏసీఎస్ చైర్మన్లు ఎల్లాగౌడు, చంద్రశేఖర్, ఎల్లనాగయ్య, పరమేష్, మల్లికార్జున, ఓంప్రకాష్, శివ, అన్వర్, శ్రీరాములు, టీఈ రాఘవేంద్ర గౌడు, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, నారాయణమూర్తి, సర్పంచ్ రేగటి అర్జున్ రెడ్డి, షేక్షావలి చౌదరి, వెంకటనారాయణగౌడు, రాఘవేంద్రరెడ్డి, భూమా నాగన్న, శ్రీనివాసులు, బీజేపీ వెంకటరమణ, జనసేన కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా, బేతంచెర్ల, ప్యాపిలి మండల నుంచి రైతులు, టీడీపీ నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

గ్రామాల్లో కూలిన మట్టిమిద్దెలు

● తప్పిన ప్రమాదం ● పొంగి ప్రవహిస్తున్న వాగులు ● పొలాల్లో నిలిచిన వర్షం నీరు



చందలూరులో కూలిన మట్టి మిద్దెను పరిశీలిస్తున్నదృశ్యం

రుద్రవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో వేర్వేరు గ్రామాల్లో మంగళవారం అర్ధరాత్రి తరువాత మూడు మట్టిమిద్దెలు కూలాయి. త్రుటిలో ప్రమాదం తప్పడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. రెవెన్యూ అధికారులు కూలిన మట్టి మిద్దెలను పరిశీలించి జాబితాను ఉన్న తాధికారులకు పంపించారు. మట్టిమిద్దెల్లో నివాసం ఉండకూడదని రెవెన్యూ అధికారులు సూచించారు. మంగళవారం రాత్రి 2గంటల నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు వర్షం కురిసింది. దాంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. 15.2ఎంఎంగా వర్షపాతం నమోదైంది. మొక్కజొన్న, పసుపు, వేరుశెనగ, మినుము పంట పొలాల్లో నీరు చేరింది. చిలకలూరు, ఎర్రగుడిదిన్నె పేరూరు, మందలూరు, చందలూరు గ్రామాల పరిధిలో సాగుచేసిన మినుము పంట వర్షానికి నీరు నిల్వ చేరి దెబ్బతింటుందని రైతులు ఆందోళన పడుతున్నారు. చిలకలూరు గ్రామ సమీపంలో వక్కిలేరు వాగు, చందలూరు సమీపంలో చిన్నేరువాగు, కొండమాయపల్లె సమీపంలో బంగారమ్మ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

ఉగ్రరూపం దాల్చిన కుందూ

చాగలమర్రి: మండలంలో ఎడతెరిపి లేకుండా మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రాజోలి ఆనకట్ట వద్ద భారీగా వరద వచ్చి చేరింది. దీంతో ఆనకట్ట వద్ద కుందూ ఉధృతి పెరిగింది. బుధవారం 30 వేల క్యూసెక్కుల నీటితో ఆనకట్ట వద్ద వరద నీరు ప్రవహిస్తున్నట్లు కేసీకెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. వరద ఉధృతి పెరగడంతో ఆనకట్టవద్దగల ఐదు గేట్లను ఎత్తి కడప జిల్లావైపుగల కుందూనదికి నీటిని విడుదల చేశారు. కుందూనది ఉధృతి మరింతే పెరిగే అవకాశం ఉందని తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు, కూలీలు, రైతులు, మహిళలు నది దాటే ప్రయత్నం చేయరాదని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పంచాయతీల అభివృద్ధి అందరి బాధ్యత

చాగలమర్రి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ పంచాయతీల పురోగతి, అభివృద్ధి అందరి బాధ్యతని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ పురోగతి ప్రణాళికపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి లక్ష్యాల గురించి అవగాహన కల్పించారు. 9 అంశాల గురించి వివరించారు. సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్, ఎంఈవో అనురాధ, ఏవో రంగనేతాజీ, పశువైద్యులు సాయిబాబా, దీపకుమారి, ఈవో తారకేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల, ఏపీవో ఖాసీం, హెచ్ఏ మనోహర్, ఏపీఎం నాగమ్మ పాల్గొన్నారు.

సంజామల: గ్రామ పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో రామసుబ్బయ్య సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల పురోగతికి సంబంధించి ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించారు. సమావేశంలో డీటీ తులసికృష్ణ, వైద్యురాలు క్రిష్ణకుమారి, ఏపీవో రవిప్రకాష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత, కార్యదర్శులు రాంబాబు, శివ విక్రమ్, లక్ష్మణ్, భారతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల: అందరి సహకారంతోనే గ్రామ పంచాయతీలు పురోభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో భరణి అన్నారు. బుధవారం పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఏపీఎం శేఖర్, అశోక్ , డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశ్‌నాయుడు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని పంచాయతీల పురోగతిపై ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి తెలిపారు. బుధవారం మండల పరిషత్ సమావేశ భవనంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అన్నిశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పంచాయతీల పురోగతిపై 2.0 పరివర్తన వ్యాప్తిపై అవగాహన సదస్సు నిర్వహించి సూచించామన్నారు. కార్య క్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుబ్రమణ్యం, ఎంపీపీ బాలస్వామి, ఏఈలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



చాగలమర్రిలో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

చాగలమర్రి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతల చెరువు, చాగలమర్రి గ్రామంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీని విద్యార్థులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. జాతీయ జెండాలు చేత పట్టుకొని వీధుల్లో నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. జాతీయ జెండాను ప్రతి ఇంటిపై ఎగరవేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సుబ్బరాయుడు, ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: దేవశ్యాప్తంగా ఆజాదిక అమృత్ ఉత్సవాలు జరుపుకుంటున్నట్లు ఆళ్లగడ్డ డిఎస్పీ ప్రమోద్ తెలిపారు. బుధవారం ఆళ్లగడ్డ పట్టణంలో అజాదిక అమృత్ ఉత్సవాలను ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు అమీర్‌బాష ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టౌన్ సీఐ యుగంధర్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బనగానపల్లె : స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీని పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కౌసల్యాదేవి, అధ్యాపకుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. త్రివర్ణ పతాకాలు చేతబట్టి విద్యార్థులు ర్యాలీలో పాల్గొని స్వాతంత్ర్య ఉద్యమ నినాదాలు చేశారు.

వృథాగా పోతున్న నీరు



చెరువు తూము ద్వారా వృథాగా పోతున్న నీరు

డోన్ రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అతిపెద్ద చెరువుగా పేరుగాంచిన వెంకటాపురం చెరువు నీరు వృథాగా ప్రవహిస్తోంది. తూము మరమ్మతుల పనులు చేపట్టకపోవడంతో చెరువు నీరు వృథాగా ప్రవహిస్తోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే తూము మరమ్మతు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

డోన్ రూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి సూచించారు. మండలంలోని ఎద్దుపెంట గ్రామంలో డెంగీ పాజిటివ్ కేసు నమోదు కావడంతో వైద్యసిబ్బంది అప్రమత్తమయ్యారు. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎద్దుపెంట గ్రామ పరిసరాలను పరిశీలించారు. మురుగునీరు ప్రదేశాల్లో దోమల నివారణ మందును పిచికారి చేయించారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న రాజారెడ్డి

బనగానపల్లె, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కరాటే పోటీల్లో రాణించాలని మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో కరాటే పోటీల్లో ప్రతిభ చూపిన పలువురు క్రీడాకారులను ఆయన సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల తిరుపతిలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో బనగానపల్లె జెన్ స్పోర్ట్స్ అండ్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన కరాటే క్రీడాకారులు పాల్గొని సత్తా చాటడం హర్షనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పోటీల్లో రాణించి బనగానపల్లెకు పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో కోచ్‌లు కళ్యాణ్‌బాబు, సూర్యవంశీ, కరాటే ఏపీ అధ్యక్షుడు కోలా ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

కృష్ణాష్టమికి ఏర్పాట్లు

కొలిమిగుండ్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 16న శ్రీకృష్ణాష్టమికి ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని బెలుం శ్రీకృష్ణ మందిరం, అంకిరెడ్డిపల్లె గీతాశ్రమం, ఇటిక్యాల, బెలుంశింగవరం తదితర గ్రామాల్లో వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. మరోవైపు ప్రబోధ సేవాసమితి, ఇందూజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు క్రిష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కోవెలకుంట్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో గురువారం ఎంపీపీ బీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భరణి మంగళవారం తెలిపారు. సమావేశానికి సర్పంచులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మండల కోఆప్షన్ మెంబర్లు హాజరు కావాలని ఆమె కోరారు. అన్నిశాఖల అధికారులు విధిగా శాఖల అభివృద్ధి నివేదికలతో రావాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సీఐ

శిరివెళ్ల, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి) : వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శిరివెళ్ల సర్కిల్ సీఐ దస్తగిరిబాబు సూచించారు. శిరివెళ్లలో ప్రమాదకరంగా ఉన్న పలు మట్టిమిద్దెలను ఎస్ఐ చిన్న పీరయ్య, పంచాయతీ కార్యదర్శి అశ్విన్ కుమార్‌తో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. సంబంధిత మట్టి మిద్దెల యజమానులు, అద్దెకు ఉంటున్న వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మట్టిమిద్దెల్లో ఎవరూ ఉండరాదని అధికారులు నోటీసులు జారీ చేశారు.

అధికారులు జాగ్రత్తగా ఉండాలి

ఆళ్లగడ్డ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని వరద ప్రాంతాలలో అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ జ్యోతి రత్న కుమారి ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నూర్జహాన్ ఆధ్వర్యంలో పరివర్తన వ్యాప్తిపై కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఎంఈవో శోభావివేకావతి, ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

చాగలమర్రి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఏవో రంగనేతాజీ హెచ్చరించారు. బుధవారం వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్, సెల్ రిజిస్టర్, ధరల పట్టిక ఉంచాలని సూచించారు. యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువులకు లింక్‌గా బయో మందులు, గుళికలు రైతులకు అంటగట్టే విషయంపై రైతులు ఫిర్యాదు చేస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు మంజుల, రేవతి ఉన్నారు.